తెలుగు దినపత్రిక

# సిరి

People's Voice

వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

26-03-2026

గురువారం హైదరాబాద్

సంపుటి: (volume): 1

సంచిక: (ISSUE): 59

PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

## పెద్ది షూటింగ్‌లో రామ్‌చరణ్‌కు స్వల్ప గాయం

ఏప్రిల్ 30న ఈ చిత్రం విడుదల కానుండగా.. వీలైనంత త్వరగా షూటింగ్ ఫినిష్ చేసేలా దూసుకుపోతోంది చిత్ర యూనిట్. ప్రజెంట్ హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. అయితే, ఈ చిత్రానికి సంబంధించిన ఒక కీలకమైన యాక్షన్ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న సమయంలో రామ్ చరణ్‌కు గాయం అయినట్టుగా తెలుస్తోంది. ఆయన కంటి సమీపంలో స్వల్ప గాయం అయిందని సమాచారం.




## 2 బిహెచ్ కే కేటాయింపులు పూర్తి చేస్తాం



- 99 రోజుల ప్రణాళికలో పట్టణాల్లో ఇండ్లకు కార్యాచరణ
- త్వరలో 1.12 లక్షల ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాలు
- జూన్ నాటికి మరో లక్ష పూర్తి
- రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖల మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, సిరి న్యూస్ మార్చి 25:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో అసంపూర్తిగా ఆగిపోయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం పూర్తిచేయడమేగాక ఖాళీగా ఉన్న ఇండ్లను అర్హులైన నిరుపేదలకు కేటాయిస్తామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. శాసనసభ సమావేశాల్లో బుధవారం సుమారు 22మంది శాసనసభ్యులు ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్ రూం ఇళ్లపై అడిగిన ప్రశ్నలకు ఆయన సుదీర్ఘ వివరణ ఇచ్చారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి అన్ని నియోజకవర్గాల్లో సమస్యలను

మిగతా 2వ పేజీలో..

## ఇంధన సరఫరాపై ప్రభుత్వం భరోసా

- పశ్చిమాసియా యుద్ధ పరిస్థితులపై అఖిలపక్ష సమావేశం
- అధికార, ప్రతిపక్ష పార్టీల నేతల హాజరు
- తృణమూల్ కాంగ్రెస్ సమావేశం బహిష్కరణ
- ముడి చమురు, ఎల్‌పీజీ సరఫరా సమృద్ధిగా ఉందని స్పష్టం
- విదేశాల్లో ఉన్న భారతీయుల భద్రతకు ప్రాధాన్యం



**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులు, ప్రపంచవ్యాప్తంగా తలెత్తుతున్న ఇంధన సంక్షోభంపై కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన పార్లమెంట్ భవనంలో జరిగిన ఈ సమావేశానికి అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన పలువురు నేతలు హాజరయ్యారు. అయితే మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ఈ సమావేశాన్ని బహిష్కరించడం గమనార్హం.

సమావేశంలో ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులపై విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, పెట్రోలియం మంత్రి హర్‌దీప్ సింగ్ పూరీ, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ వివరాలు వెల్లడించారు. దేశంలో ముడి చమురు, ఎల్‌పీజీ తదితర అవసరమైన ఇంధన సరఫరా సమృద్ధిగా ఉందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం

మిగతా 3వ పేజీలో..

## చెప్పేది వినకుండా వెళ్లిపోతే ఎలా?



### పేదల సంక్షేమంపై వివరిస్తుంటే పట్టదా?
### బీఆర్ఎస్ సభ్యులపై డిప్యూటీ సీఎం ఫైర్

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎన్ని కోట్లయినా ఇస్తాం

వారం వారం బిల్లుల చెల్లించడానికి సిద్ధం అన్న భట్టి

**హైదరాబాద్, సిరి న్యూస్ మార్చి 25:** పేదల సంక్షేమం గురించి అసెంబ్లీలో వివరిస్తుంటే వినడానికి ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యులకు మనసు లేదని, అందుకే బడ్జెట్‌పై సమాధానం వినకుండా సభ నుంచి పారిపోయారని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో

మిగతా 3వ పేజీలో..



### ఫార్ములా ఈ రేసు కేసుపై కేటీఆర్ సవాలు

'కాంగ్రెస్ నాయకులారా.. రండి చూసుకుందాం'

2

## అవన్నీ వదంతులే

- రాష్ట్రంలో సరిపడ ఇంధన నిల్వలు
- కొరత అంటూ ఆందోళన చెందనవసరం లేదు
- ప్రజలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి

2



## పెట్రోల్ బంక్‌ల వద్ద భారీ క్యూలు



- సాధారణం కంటే రెండుమూడు రెట్లు అధిక అమ్మకాలు
- అమ్మకాలు పెరగడంతో 'నో స్టాక్' బోర్డులు..
- చమురు, గ్యాస్ స్టాక్ పుష్కలం..
- పౌరసరఫరాల శాఖ, మంత్రుల ప్రకటన

2



## స్పీకర్‌ను డిక్టేట్ చేయొద్దు

- బీఆర్ఎస్ సభ్యులకు మంత్రి దుద్దిళ్ల హితవు

**హైదరాబాద్, సిరి న్యూస్ మార్చి 25:** సభను ఎలా నడపాలో స్పీకర్‌ను డిక్టేట్ చేయాలని బీఆర్ఎస్ సభ్యులు చూడటం మంచి పద్ధతి కాదని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హితవు పలికారు. అధికార పక్షంలో ఉన్నప్పుడు బుల్డోజ్ చేశారు.. ఇప్పుడూ అలాగే

మిగతా 3వ పేజీలో..



### ఎందుకీ 'వివక్ష' వ్యాఖ్యలు?

- సీఎం రేవంత్‌ను ప్రశ్నించిన కేంద్ర మంత్రి బండి

**హైదరాబాద్, సిరి న్యూస్ మార్చి 25:** అసెంబ్లీ, పార్లమెంట్ సీట్ల సంఖ్య పెంపుతో దక్షిణాది రాష్ట్రాలకు నష్టమేమీ ఉండదని కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. మహిళలకు చట్ట సభల్లో 33 శాతం సీట్లు

మిగతా 3వ పేజీలో..



### దేశంలో 100 కొత్త ఎయిర్‌పోర్టులు

## కేంద్ర క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్

- ప్రాంతీయ ఎయిర్ కనెక్టివిటీ పెంపునకు కేంద్రం నిర్ణయం
- ఉడాన్ స్కీమ్ కింద 10 ఏళ్లలో నిర్మాణాల ప్రణాళిక
- రూ.28,840 కోట్ల వ్యయానికి ఆమోదం
- టైర్2, టైర్3 పట్టణాలు, సరిహద్దు ప్రాంతాలకు ప్రాధాన్యం

2



## కాంగ్రెస్‌కు జీవన్ రెడ్డి గుడ్‌బై

- నాలుగు పేజీల లేఖ విడుదల
- పదేళ్లుగా అవమానాలు భరించాక కూడా పట్టించుకోరా..
- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందన్న భావనే లేదు
- ఇక రేవంత్ రెడ్డిపైనే నా పోరాటం



2

### ఎం ఐఎంపై గవర్నర్‌కు

## బీజేపీ ఫిర్యాదు

వందేమాతరం ఆలపిస్తుండగా వెళ్లిపోవడంపై

**హైదరాబాద్, సిరి న్యూస్ మార్చి 25:** ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగించిన సందర్భంలో జాతీయ గీతం వందేమాతరం ఆలాపన జరుగుతుండగా ఎంఐఎం ఎమ్మెల్యేలు సభ నుండి వాకౌట్ చేయడంపై రాష్ట్ర గవర్నర్‌కు బీజేపీ ఫిర్యాదు చేసింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన

మిగతా 2వ పేజీలో..



# పెట్రోల్ బంక్‌ల వద్ద భారీ క్యూలు

**హైదరాబాద్, సిరి న్యూస్ మార్చ్ 25:**

రాష్ట్రంలో హైదరాబాద్ సహా పలు ప్రాంతాల్లో పెట్రోల్ బంకుల వద్ద భారీ క్యూలు కనిపిస్తున్నాయి. ఇంధనం దొరకదనే భయంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. పెట్రోల్, డీజిల్ స్టాక్ అయిపోతుందనే ప్రచారంతో వాహనదారులు బంకుల వద్దకు పోటెత్తుతున్నారు. సాధారణం కంటే 2.5 నుండి 3 రెట్లు అధికంగా అమ్మకాలు జరుగుతున్నట్లు పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ తెలిపింది. అకస్మాత్తుగా పెరిగిన డిమాండ్ వల్ల కొన్ని బంకుల్లో స్టాక్ త్వరగా అయిపోయి 'నో స్టాక్' బోర్డులు వెలిశాయి. ఇది ప్రజల్లో మరింత భయాన్ని పెంచింది. భవిష్యత్తు అవసరాల కోసం చాలా మంది బాటిళ్లు, ప్లాస్టిక్ క్యాన్లలో పెట్రోల్ నింపుకుంటున్నారు. ఇది ప్రమాదకరమని అధికారులు హెచ్చరిస్తున్నారు. పశ్చిమాసియా దేశాల్లో నెలకొన్న యుద్ధ మేఘాల వల్ల ముడి చమురు సరఫరా ఆగిపోతుందనే పుకార్లు సోషల్ మీడియాలో విపరీతంగా వ్యాపించాయి. చమురు సంస్థలు (హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐఓసీఎల్) డీలర్లకు ఇచ్చే క్రెడిట్ పరిమితులను తగ్గించి, 'ముందుగా నగదు చెల్లిస్తేనే సరఫరా' అనే కొత్త నిబంధనను తెచ్చినట్లు తెలుస్తోంది. దీనివల్ల కొందరు డీలర్లు తగినంత స్టాక్ తెప్పించుకోలేకపోతున్నారు. గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ల బుకింగ్ గడువును 21 రోజుల నుండి 25 రోజులకు పెంచారనే వార్తలు మరియు కమర్షియల్ గ్యాస్ సరఫరాపై ఆంక్షలు హోటల్ యజమానులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. తెలంగాణ పౌర సరఫరాల శాఖ మరియు చమురు సంస్థలు ఈ ఆందోళనలను కొట్టిపారేశాయి: రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ఎక్కడా కొరత లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రజలు అనవసరంగా భయాందోళనకు గురై ట్యాంకులు నింపుకోవడం వల్లే కృత్రిమ కొరత ఏర్పడుతోందని అధికారులు తెలిపారు. ఇంధనాన్ని అక్రమంగా నిల్వ చేసినా లేదా బ్లాక్ మార్కెట్‌లో విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించింది. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మొద్దు. వాహనదారులు తమ రోజువారీ అవసరాలకు సరిపడా మాత్రమే ఇంధనాన్ని కొనుగోలు చేయాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. పౌరసరఫరాల శాఖ మంత్రి, పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తదితరులు కూడా ప్రజలు అనవసరంగా ఆందోళన చెందవద్దని, ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, సోషల్ మీడియా వార్తలు అసత్యాలని స్పష్టం చేశారు. అయినప్పటికీ హైదరాబాద్ నగరంలోని పలుచోట్ల (సఫిల్‌గూడ, తార్నాక, ఈస్ట్ ఆనంద్‌బాగ్, మౌలాలి ప్రాంతాల్లో వందల ద్విచక్ర వాహనదారులు, గ్యాస్ బంకుల వద్ద ఆటోవాలాలు ఉదయం నుంచి బారులు తీరారు. 11 గంటలకు కొన్ని పెట్రోల్ బంకులు మూసివేశారు.



# ఎం ఐఎంపై గవర్నర్‌కు బీజేపీ ఫిర్యాదు

**మొదటిపేజీ తరువాయి**

కార్యదర్శి వేముల అశోక్, ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు, కోశాధికారి దేవకీ వాసుదేవరావు, మీడియా అధికార ప్రతినిధులు గవర్నర్‌కు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిగా నిలిచిన వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్నప్పుడు ఎంఐఎం ఎమ్మెల్యేలు బయటకు వెళ్లడం అంటే రాజ్యాంగాన్ని అవమానించడమేనన్నారు. భారత్ మాతాకి జై అనడం రాదు.. జై హింద్ అనడం రాదు.. కానీ జై పాలస్తీనా అంటారు అని ఎద్దేవా చేశారు. వందే మాతర గీతం ఆలపించే సమయంలో వాకౌట్ చేయడం అంటే సభా నిబంధనల ఉల్లంఘన మాత్రమే కాదు.. దేశానికి తీరని అవమానం జరిగిందని తెలిపారు. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉండి జాతీయ చిహ్నాల పట్ల కనీస గౌరవం లేని ఎంఐఎం సభ్యుల తీరు వారి సంకుచిత మనస్తత్వాన్ని బయటపెట్టిందన్నారు. సభ గౌరవాన్ని, జాతీయ గీత ప్రతిష్ఠను దిగజార్చిన ఆ ఎమ్మెల్యేలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, అవసరమైతే వారి శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని బీజేపీ డిమాండ్ చేస్తోందన్నారు. దేశ గౌరవం కంటే ఏ పార్టీ లేదా మతం ముఖ్యం కాదని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకోవడమే ఏకైక మార్గమని రామచందర్‌రావు స్పష్టం చేశారు.

# ఫార్ములా ఈ రేసు కేసుపై
# కేటీఆర్ సవాలు

- 'స్కాంగ్రెస్ నాయకులారా.. రండి చూసుకుందాం'

**హైదరాబాద్ సిరి న్యూస్:**

ఫార్ములా ఈ రేసు కేసు పేరిట రాష్ట్ర ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్ల నాలుగు నెలలు గడిచినా ప్రభుత్వానికి సంబంధించిన అన్ని పత్రాలు, యంత్రాంగం చేతిలో ఉన్నప్పటికీ ఫార్ములాఈ అంశంపై మాత్రమే కేసు పెట్టగలిగారని పేర్కొన్నారు. ఏసీబీ ఛార్జ్‌షీట్ రేవంత్ ప్రభుత్వం నిస్పృహలో ఉందని చూపించడమే కాకుండా తమ పాలన మచ్చలేనిదని నిరూపించే సర్టిఫికేట్‌లాంటిదని తెలిపారు. ఫార్ములా ఈ రేసు ద్వారా హైదరాబాద్‌ను ప్రపంచ నగరాల సరసన నిలిపేందుకు ఉపయోగించిన రూ.49 కోట్ల బ్యాంక్‌టుబ్యాంక్ నిధుల బదిలీని స్కామ్‌గా పేర్కొనడం సరైంది కాదని ప్రశ్నించారు. అసెంబ్లీలోని బీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన సందర్భంగా ఇక్కడి బ్యాంకు నుంచి పంపిన నిధులు సంబంధిత బ్యాంకు ఖాతాలోనే భద్రంగా ఉన్నాయని, ఎలాంటి దుర్వినియోగం జరగలేదని స్పష్టం చేశారు. ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌పై బీఆర్ఎస్ తెస్తున్న ప్రైవేట్ మెంబర్ బిల్లుపై ప్రజల దృష్టి మళ్లించేందుకే ఫార్ములా ఈ రేసు కేసును మళ్లీ తెరపైకి తీసుకొచ్చారని విమర్శించారు.



# కాంగ్రెస్‌కు జీవన్ రెడ్డి గుడ్‌బై

- నాలుగు పేజీల లేఖ విడుదల
- పదేళ్లుగా అవమానాలు భరించాక కూడా పట్టించుకోరా..
- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందన్న భావనే లేదు
- ఇక రేవంత్ రెడ్డిపైనే నా పోరాటం



**జగిత్యాల, సిరి న్యూస్ మార్చి 25:**

కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయడానికే మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి నిర్ణయించుకున్నట్లుగా తెలుస్తోంది. ఆయన తన నిర్ణయాన్ని మార్చుకోవడానికి సిద్ధంగా లేరు. ఈ క్రమంలో రాజీనామాపై మరోసారి స్పందించారు. రాజీనామా చేయడానికి గల కారణాలను వివరించారు. కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ విధానాలకు విరుద్ధంగా తెలంగాణ కాంగ్రెస్ నడుస్తోందని జీవన్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్న సంతోషం లేకుండా చేశారని మండిపడ్డారు. 20 నెలలుగా పార్టీలో మానసిక వేదనకు గురైనట్లు తెలిపారు. అందుకే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. నాలుగు పేజీల రాజీనామా లేఖను కార్యకర్తల సమావేశంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి మీద పోరాటం చేస్తానంటూ శపథం చేశారు. తనను నమ్ముకున్న అనుచరులకి పదవులు రాకపోతే పార్టీలో కొనసాగడం అవసరమా అని ప్రశ్నించారు. ప్రభుత్వ న్యాయవాదుల నియామకంలోనూ తాను న్యాయవాదిని అయినా పట్టించు కోలేదన్నారు. గత పదేళ్లలో కాంగ్రెస్ కార్యకర్తలని హింసించి కొట్టించిన వారిని గద్దెనెక్కిస్తే ఎలా? అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం మాది అన్న ఫీలింగ్ మావారికి లేదని.. గాంధీభవన్‌లో ఫిరాయింపుల ఎమ్మెల్యే ఉంటే సమావేశంలో ఎలా పాల్గొంటారన్నారు. రాహుల్ గాంధీ ఫాంచ్ న్యాయ్ అని రాజ్యాంగం పట్టుకొని తిరుగుతే ఇక్కడ రాజ్యాంగాన్ని అవమాన పరుస్తున్నారన్నారు. ఈ వయస్సులో నేను పార్టీ మారి ఎం చేస్తాను. కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల్లో తలదూర్చితే నేను ఎలా భరిస్తాను. నేను ఇరవై మాసాలు ఓపిక పట్టాను. కాంగ్రెస్ పార్టీలో నన్ను అడుక్కునే స్థాయికి పట్టుకొచ్చారు. మీనాక్షి నటరాజన్ ఎనభై శాతం సీట్లు నాకే ఇస్తామని మాట ఇచ్చారు.. ఆ మాట పట్టించుకోలేదు. నాకు టికెట్లు ఇవ్వాలని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఎలా చెబుతాడు. పదవులు కావాలనుకుంటే నేను బీఆర్ఎస్‌లోకి వెళ్లేవాడిని. పీసీసీ అధ్యక్షుడు కావాల్సినోడిని నా హక్కుల కోసం పోరాటం చేసే పరిస్థితి వచ్చింది. జీవన్ రెడ్డి అణగదొక్కాలన్నదే ఆలోచన. చంద్రబాబు, కేసీఆర్‌ల మీద పోరాటం చేశాను.. ఇప్పుడు రేవంత్‌రెడ్డి మీద పోరాటం చేస్తాను. అడుగులకి మడగులు ఒత్తేటోళ్ళే కు కావాలా? రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగా నడిచే వాణ్ని అణగదొక్కారు. బతకవచ్చిన పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వం సలహాదారుడా? పోచారం ఇప్పటివరకు ఏం సలహాలు ఇచ్చాడని సీనియర్ నేత జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీ ఫిరాయింపుల అంశంలో రాహుల్ నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్ర నాయకత్వం ప్రవర్తిస్తోందని జీవన్ రెడ్డి మండిపడ్డారు. హైకమాండ్ తీరు, పార్టీలోకి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను తీసుకున్న కారణంగానే మనస్తాపంతో పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ కష్టార్జితమని.. పదేళ్లు తమను ఇబ్బంది పెట్టిన వారిని తీసుకువచ్చి పార్టీలో చేర్చుకుంటారా? అంటూ ధ్వజమెత్తారు. తెలంగాణ కాంగ్రెస్ నిర్ణయాలు జాతీయస్థాయిలో ప్రభావితం చూపబోతున్నాయని.. 'జై భీమ్‌జై సంవిధాన్‌జై బాపు' నినాదాలకు తూట్లు పొడిచారంటూ విమర్శించారు. కాంగ్రెస్‌ను వీడటం బాధగా ఉన్నా తప్పడం లేదంటూ మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వివరించారు.

# 2-బిహెచ్ కే కేటాయింపులు పూర్తి చేస్తాం

**మొదటిపేజీ తరువాయి**

పరిష్కరించేందుకు వీలుగా త్వరలో ఉమ్మడి జిల్లాల పరిధిలో ప్రత్యేక సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. సభ్యులు తమ దృష్టికి తెచ్చిన అంశాలతోపాటు మిగిలిన నియోజకవర్గాల్లోని ఇండ్ల సమస్యలను పరిష్కరించేందుకు కొద్ది రోజుల్లో ఒక టోల్‌ఫ్రీ నెంబర్‌ను అందుబాటులోకి తెస్తామని, వీటి ద్వారా వచ్చే ప్రశ్నలకు 24 గంటల్లోగా సమాధానం చెప్పడమేగాక వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి మూడు విభాగాలుగా సమస్యలను విభజించి పరిష్కరించడానికి చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో నాటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి చొరవతో తెలంగాణ ప్రాంతంలో 21లక్షల ఇండ్లు నిర్మించారని, మళ్లీ ఈ పేదల ప్రభుత్వంలోనే పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం సాగుతోందని తెలిపారు. గత ప్రభుత్వం రెండు లక్షల పైచిలుకు ఇండ్లను మంజూరు చేసి హైదరాబాద్ ప్రాంతానికి లక్ష ఇండ్లను కేటాయించగా వీటిలో 78,861 ఇండ్లు పూర్తయినా మౌలిక సదుపాయాలకు నోచుకోలేదని, 21,838 ఇండ్లు పునాదులకే పరిమితమయ్యాయని తెలిపారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో 26 కాలనీలు అసంపూర్తిగా ఉండిపోయాయని, తాము కొత్తగా కంటోన్మెంట్ నియోజకవర్గానికి ఇండ్లు మంజూరు చేశామంటూ రూ.738 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించామని చెప్పారు. తాము ఎలాంటి భేషజాలకు పోకుండా గతంలో అసంపూర్తిగా మిగిలిపోయిన 92వేల ఇళ్లలో 62వేల ఇళ్లు పూర్తి చేశామన్నారు. 2023 ఎన్నికలకు ముందు నాటి ప్రభుత్వం 23,500 ఇండ్లను కేటాయించగా నగరంలో వృత్తి వ్యాపారాలు చేసుకునే వారు 2030 కి.మీ దూరంలో కేటాయించిన ఇండ్లలోకి రాలేదని, ఫలితంగా 12వేలకుపైగా ఇండ్లు ఖాళీగా ఉండిపోయాయని చెప్పారు. దీనిపై ఉన్నతాధికారులు, నాలుగు జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో మూడుసార్లు ప్రత్యేక సమావేశాలు నిర్వహించామని, లబ్ధిదారులకు మరో అవకాశాన్ని కల్పిస్తూ రెండు నెలల్లోగా వీటిలో గృహప్రవేశాలు చేయాలని నోటీసులు ఇచ్చామని తెలిపారు. ఒకవేళ వారు రాలేకపోతే సుమారు 510 కి.మీ పరిధిలో ఉండే అర్హులైన పేదలకు కేటాయించేందుకు నిర్ణయించామని మంత్రి పొంగులేటి తెలిపారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక99 రోజుల కార్యక్రమంలో భాగంగా కొత్త కేటాయింపులు పూర్తి చేస్తామని సభకు తెలిపారు.



**కాలనీలకు మౌలిక సదుపాయాల కోసం రూ.784 కోట్లు**


2017లో చేపట్టిన కాలనీలకు మౌలిక సదుపాయాలకు సంబంధించి గతంలో రూపొందించిన అంచనాలు రద్దు చేస్తూ జీవో ఇచ్చామని, అలాగే జర్నలిస్టుల కాలనీలకు కూడా మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో సుమారు 80 కాలనీలకు మౌలిక సదుపాయాల కోసం రూ.784 కోట్లు మంజూరు చేశామని, సుమారు రూ.432 కోట్లు ఖర్చు చేయగా మిగిలిన మొత్తంతోపాటు మరో రూ.270 కోట్ల వరకు అవసరం ఉంటుందని భావిస్తున్నామన్నారు. రాష్ట్రంలో తొలి విడత 4.50 లక్షల ఇండ్లు మంజూరు చేస్తూ ప్రత్యేకంగా చెంచులకు, ఐటీడీఏ పరిధిలో గిరిజనులకు 12వేల ఇండ్లను మంజూరు చేశామని తెలిపారు. గతంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం పూర్తి చేస్తామని, ఇంతవరకు కేటాయించని ఇండ్లకు సంబంధించి పాత కాంట్రాక్టర్లు అప్పటి రేటుకు సమ్మతిస్తే వారికి పనులు అప్పగిస్తామని తెలిపారు. 99 రోజుల ప్రణాళికా కార్యక్రమంలో లబ్దిదారుల ఎంపిక పూర్తి చేస్తామని, గతంలో నిర్మాణాలు చేపట్టి ఆపివేసిన లబ్దిదారులకు మిగిలిన నిర్మాణాలకు గాను నిధులు విడుదల చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల కమిటీలకు గ్రామాల్లో సర్పంచ్ అధ్యక్షునిగా ఉంటారని, ఆయన ఆధ్వర్యంలోని కమిటీ నిరుపేదలను ఎంపిక చేస్తే కలెక్టర్ పరిశీలన, అనంతరం జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతో కేటాయింపులు జరుగుతాయని, రానున్న కాలంలో ఈ కమిటీల్లో ఎమ్మెల్యేలకు ప్రాతినిధ్యం కల్పించేలా పరిశీలిస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో ఈ నెల 31నాటికి సుమారు లక్షా 12వేల ఇందిరమ్మ ఇండ్లు పూర్తయి గృహప్రవేశాలు జరగనున్నాయని, జూన్ నాటికి మరో లక్ష ఇండ్ల నిర్మాణం పూర్తవుతుందని మంత్రి పొంగులేటి ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఈ ఏడాది ఏప్రిల్‌లో రెండో విడత ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని తెలిపారు. గతంలో గృహలక్ష్మి పథకం కింద ప్రారంభించి అసంపూర్తిగా ఆగిపోయిన ఇండ్లకు నిధులు ఇస్తామని, దీనిపై కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవలసి ఉందని తెలిపారు. జీహెచ‌ఎంసీ పరిధిలో ఇండ్ల నిర్మాణానికి ఇప్పటికే 1415 స్థలాలను గుర్తించామని, ఆయా ప్రాంతాల్లోని నిరుపేదలకు ఇండ్లు ఇస్తామని, రాష్ట్రంలోని ఇతర ముఖ్య పట్టణాల్లో కూడా ఇదే పద్ధతిని అమలు చేస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

# దేశంలో 100 కొత్త ఎయిర్‌పోర్టులు కేంద్ర క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్

- ప్రాంతీయ ఎయిర్ కనెక్టివిటీ పెంపునకు కేంద్రం నిర్ణయం
- ఉడాన్ స్కీమ్ కింద 10 ఏళ్లలో నిర్మాణాల ప్రణాళిక
- రూ.28,840 కోట్ల వ్యయానికి ఆమోదం
- టైర్-2, టైర్-3 పట్టణాలు, సరిహద్దు ప్రాంతాలకు ప్రాధాన్యం
- హెలిపోర్టులు, వాటర్ ఏరోడ్రోమ్స్ నిర్మాణానికీ ఏర్పాట్లు

**న్యూఢిల్లీ:**

ప్రాంతీయ ఎయిర్ కనెక్టివిటీ పెంచేందుకు దేశవ్యాప్తంగా 100 కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రణాళికలో భాగంగా ఎయిర్‌పోర్టులతోపాటు హెలిపోర్టులు, వాటర్ ఏరోడ్రోమ్స్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. 202627 నుంచి 203536 వరకు పదేళ్లపాటు ఉడాన్ స్కీమ్ కింద ఈ నిర్మాణాలు చేపట్టనున్నారు. ఇందుకోసం రూ.28,840 కోట్లను కేంద్రం కేటాయించనుంది. చిన్న పట్టణాలకు ఎయిర్ కనెక్టివిటీ అందించడం, ఏవియేషన్ నెట్‌వర్క్ విస్తరణ, ప్రాంతీయ రవాణా వ్యవస్థ బలోపేతం లక్ష్యంగా ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నారు. టైర్2, టైర్3 పట్టణాలు, హిల్ స్టేషన్లు, సరిహద్దు ప్రాంతాలు, దీవుల ప్రాంతాల్లో ఈ ఎయిర్‌పోర్టులు నిర్మించనున్నారు. ఎయిర్‌పోర్టులు నిర్మించడం సాధ్యం కాని ప్రాంతాల్లో 200 ప్రత్యేక హెలిప్యాడ్లు, వాటర్ ఏరోడ్రోమ్స్ ఏర్పాటు చేయనున్నారు.



అదేవిధంగా 441 ఏరోడ్రోమ్‌ల నిర్మాణం, నిర్వహణ ఖర్చుల కోసం మరో రూ.2,577 కోట్లను కూడా కేంద్రం కేటాయించింది. ఇప్పటికే నిర్మాణం పూర్తై ప్రయాణికుల డిమాండ్ తక్కువగా ఉన్న ఎయిర్‌పోర్టుల్లో కూడా సేవలను కొనసాగించాలని నిర్ణయించింది. ఈ చర్యల ద్వారా దేశవ్యాప్తంగా వైమానిక రవాణా విస్తరణకు ఊతం లభిస్తుందని కేంద్రం భావిస్తోంది.

# అవన్నీ వదంతులే

- రాష్ట్రంలో సరిపడ ఇంధన నిల్వలు
- కొరత అంటూ ఆందోళన చెందనవసరం లేదు
- ప్రజలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి

**హైదరాబాద్, సిరి న్యూస్ మార్చి 25:**

రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, ఎల్‌పిజి కొరత ఉత్పన్నమయ్యే ప్రసక్తే లేదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రధానంగా హైదరాబాద్‌లో డీజిల్, పెట్రోల్ బంక్‌ల వద్ద పెద్ద ఎత్తున ఉన్న క్యూలను చూసి పెట్రోల్, డీజిల్, ఎల్‌పిజి కొరత అంటూ జరుగుతున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ వదంతులతో ప్రజలు గందరగోళంలో పడవద్దని విజ్ఞప్తి చేశారు. శాసనసభ ప్రాంగణంలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ మూడు నెలలకు సరిపడ నిల్వలు ఉన్నాయన్నారు. ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ కంపెనీలు ఇంధన సరఫరాలను గణనీయంగా పెంచాయంటూ డిమాండ్‌ని మించి సరఫరా కొనసాగుతోందని తెలిపారు. బుధవారం 17,246 కిలోలీటర్ల డిమాండ్ ఉండగా 17,898 కిలోలీటర్ల సరఫరా జరగడమే నిదర్శనమన్నారు. అంటే 652 కిలో లీటర్ల అదనపు సరఫరా జరిగిందన్నారు. దీనికితోడు అదనంగా 16,000 కిలో లీటర్ల ఇంధనం నిల్వ ఉంచడంతోపాటు 1200 అదనపు ట్యాంకర్లను వినియోగిస్తున్నామని మంత్రి తెలిపారు. వినియోగదారులు గందరగోళంలో పడి పెద్ద ఎత్తున కొనుగోళ్లు చేయడంతో ఒక్కసారిగా రోజువారీ డిమాండ్ 25% పెరిగిందని, అయినా రోజువారీ సరఫరాలో సగటున పోల్చి చూసినా కూడా ఎక్కడా అంతరాయం కలగకుండా అదనంగా 22% ఇంధన వనరులు నిల్వలు ఉన్నాయని తెలిపారు. అయితే కొన్ని పెట్రోలు బంకులకు నిర్ణీత సమయానికి ట్యాంకర్లు చేరుకోనందున నోస్టాక్ బోర్డులు వెలుస్తున్నాయన్నారు. వాస్తవంగా ఎంతమాత్రం కొరత లేదని ఆయన పునరుద్ఘాటించారు. షికార్లు చేస్తున్న పుకార్లను నమ్మి వినియోగదారులు కంటైనర్లలో, డబ్బాలలో పెట్రోల్, డీజిల్ తీసుకెళ్లడం పూర్తిగా చట్టవ్యతిరేకమైన చర్య అని, అంతకుమించి ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. పెట్రోలియం నిల్వలు రానున్న 65 రోజులకు సరిపడా ఉన్నాయని, సరఫరాలో ఎటువంటి ఆటంకాలు ఎదురు కాకుండా ఉండేలా నిరంతరం కొనసాగేలా ఓజీసీ లైన్‌ను విస్తరించినట్లు వెల్లడించారు. రాష్ట్ర రాజధానిలో 596 పెట్రోల్ బంకులు నిరంతరాయంగా పని చేస్తున్నాయని, హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలో ఎక్కడా కొరత లేదని, అహ్మదాబాద్, సూరత్, బెంగుళూరు, ధారవాడ, బెల్గాం వంటి నగరాలలో కూడా ఇదే పరిస్థితి ఉత్పన్నమైందని చెప్పారు. ఎల్‌పిజి గ హ వినియోగ సిలిండర్ల కొరత లేదని, కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో కొంత సమస్య ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. ఇదే సందర్భంలో అక్రమంగా వినియోగిస్తున్న 2,952 కమర్షియల్ సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. పెట్రోల్, డీజిల్ గృహ వినియోగదారులకు అవసరమైన ఎల్.పి.జి సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, ప్రజలెవరూ అయోమయానికి, ఆందోళనకు గురికావద్దని, వదంతులను ఎట్టిపరిస్థితుల్లోనూ నమ్మొద్దని ప్రజలకు మంత్రి ఉత్తమ్ కుమార్ పిలుపునిచ్చారు.



# ఏప్రిల్ 1 నుంచి చికెన్ షాపులు బంద్




**హైదరాబాద్ సిరి న్యూస్:** పౌల్ట్రీ కంపెనీలు ఇస్తున్న అతి తక్కువ లాభాల మార్జిన్‌కు వ్యతిరేకంగా ఏప్రిల్ 1 వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా చికెన్ షాపులను మూసివేయాలని చికెన్ వ్యాపారులు సంచలన నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యంగా హైదరాబాద్‌లోని ఉప్పల్, ఎల్బీనగర్ వంటి ప్రాంతాల్లో "తక్కువ మార్జిన్‌తో వ్యాపారం అసాధ్యం" అంటూ ఇప్పటికే నిరసన పోస్టర్లు వెలిశాయి. తెలంగాణ చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ తెలిపిన వివరాల ప్రకారం.. గత కొంతకాలంగా చికెన్ ఫీడ్ ఖర్చులు, ట్రాన్స్‌పోర్ట్ వ్యయాలు పెరుగుతున్నా, వ్యాపారులకు ఇచ్చే కమిషన్‌ను మాత్రం కంపెనీలు భారీగా తగ్గించాయి. పౌల్ట్రీ కంపెనీలు ఏకపక్షంగా ధరలు నిర్ణయించడం వల్ల రోజువారీ ఖర్చులు కూడా రావడం లేదని, అనేక షాపులు నష్టాల్లో నడుస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని పౌల్ట్రీ కంపెనీలతో చర్చలు జరపాలని వారు డిమాండ్ చేస్తున్నారు. బంద్ ప్రభావం సామాన్య వినియోగదారులపై తీవ్రంగా పడే అవకాశం ఉంది. చికెన్ సరఫరా నిలిచిపోవడంతో మార్కెట్‌లో ధరలు ఒక్కసారిగా పెరగవచ్చు. కేవలం గృహ అవసరాలకే కాకుండా, హోటళ్లు మరియు రెస్టారెంట్లు కూడా చికెన్ కొరతతో ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడనుంది. తమ సమస్యలు పరిష్కరించే వరకు షాపులు తెరిచే ప్రసక్తే లేదని అసోసియేషన్ స్పష్టం చేస్తూ, వినియోగదారులు కూడా తమకు సహకరించాలని విజ్ఞప్తి చేసింది.

# చెప్పేది వినకుండా వెళ్లిపోతే ఎలా?

**మొదటిపేజీ తరువాయి**



ధ్వజమెత్తారు. అసెంబ్లీలో బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై ఆయన సుదీర్ఘంగా మాట్లాడారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే ప్రస్తుత ప్రజా ప్రభుత్వ చిత్తశుద్ధిని చాటిచెప్పారు. గత పాలకులు మాయమాటలు చెప్పి, ప్రజల్లో భ్రమలు కల్పించి, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టిస్తామని ఓట్లు వేయించుకున్నారు. కానీ, పదేళ్ల అధికారంలో ఏ ఒక్క పేదవాడికీ ఇల్లు కట్టించి ఇవ్వకుండా వారిని గాలికి వదిలేశారని భట్టి విమర్శించారు. పేదలు ఆత్మగౌరవంతో బతకాలన్న ఉన్నత లక్ష్యంతో ఉమ్మడి రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని, అదే స్ఫూర్తితో నేడు తమ ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించిందని గుర్తు చేశారు. బడ్జెట్ ప్రతులను చింపి చెవిలో పెట్టుకుని సభ నుంచి వెళ్లిపోయిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు బడ్జెట్ కేటాయింపుల గురించి మాట్లాడే అర్హత లేదని మండిపడ్డారు. పేదలు ఇల్లు కట్టుకుని ఆత్మగౌరవంతో బతకడం వారికి ఇష్టం లేనట్లుంది అని విమర్శించారు. బడ్జెట్‌లో నిధులు తగ్గించామంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వాస్తవానికి ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి ఏకంగా రూ.22,500 కోట్లు కేటాయించామని మంత్రి స్పష్టం చేశారు. హౌసింగ్ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి ఇందిరమ్మ ఇళ్లపై నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. పనులు వేగవంతం చేసేందుకు గతంలోలాగా నెలలతరబడి వేచి చూడకుండా వారానికోసారి బిల్లులు చెల్లించేలా నిక్కచ్చిగా ఆదేశాలు జారీ చేశామన్నారు. ఇల్లు కట్టండి.. బిల్లు తీసుకోండి అనే నినాదంతో లబ్ధిదారులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నామని, ప్రభుత్వంపై ఆర్థిక భారం ఉన్నప్పటికీ పేదల కోసం వెనకడుగు వేయలేదని వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకానికి నిధులు సిద్ధంగా ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఇళ్ల నిర్మాణం ఇంకా వేగవంతం కావాలని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు. ఇప్పటివరకు లబ్ధిదారులకు చెల్లించిన బిల్లులు రూ.5,000 కోట్లు దాటలేదని, ఎమ్మెల్యేలందరూ తమ నియోజకవర్గాల్లో పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. నిర్మాణాలు ఎంత వేగంగా జరిగితే అంత త్వరగా నిధుల విడుదలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో ఇల్లు లేని పేదలు ఉండకూడదన్న ఆశయంతో పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఎన్ని కోట్ల రూపాయలైనా వెచ్చించడానికి సిద్ధంగా ఉందని భట్టి స్పష్టం చేశారు.



# ధూళిపాళ్ల కుమార్తె వివాహానికి రేవంత్ రెడ్డి

**గుంటూరు, సిరి న్యూస్:** గుంటూరు జిల్లా పొన్నూరు ఎమ్మెల్యే, సీనియర్ నేత ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ కుమార్తె వివాహ వేడుక రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రముఖ రాజకీయ నేతల కలయికతో సందడిగా మారింది. గుంటూరులోని శ్రీ కన్వెన్షన్‌లో బుధవారం జరిగిన నాగసాయి వైదీప్తి - కెవిన్ రామ్ వివాహ వేడుక రాజకీయ ప్రముఖుల సమక్షంలో వైభవంగా జరిగింది. ఈ వివాహానికి ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వారితో పాటు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, మంత్రులు నారా లోకేశ్, పయ్యావుల కేశవ్, అనిత, సంధ్యారాణి, సవిత, పలువురు ఎమ్మెల్యేలు హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఎందుకీ వివక్ష వ్యాఖ్యలు?

**మొదటిపేజీ తరువాయి**



కేటాయిస్తే మీకొచ్చిన నష్టమేంటి అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. దక్షిణాదిపై కేంద్రం వివక్ష చూపుతోందని, పోరాటానికి దక్షిణాది రాష్ట్రాలు సిద్ధం కావాలంటూ డిలిమిటేషన్, 50 శాతం ఎంపీ స్థానాల పెంపుపై రేవంత్ రెడ్డి మంగళవారం చేసిన వ్యాఖ్యలకు ఆయన కౌంటర్ ఇచ్చారు. మీడియాతో బుధవారం మాట్లాడుతూ ప్రాంతీయ అసమానతల పేరు చెప్పి ఇంకెన్నాళ్లు చలి కాచుకుంటారని నిలదీశారు. దేశాన్ని విభజించాలని చూస్తున్నారా.. దేశభక్తి, జాతీయ వాదం మీలో మచ్చుకైనా కనిపించవా అని అడిగారు. దక్షిణాదిలోని తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో కాంగ్రెస్ కూటమి ఓడిపోతుందనే వణుకు మీలో మొదలైందా అని ఎద్దేవా చేశారు. ఎన్ని గిమ్మిక్కులు చేసినా కాంగ్రెస్ పాచిక తమిళనాడు, కేరళలో పారడం లేదని అర్థమైంది.. అందుకే దక్షిణాదికి అన్యాయం జరుగుతోందని కొత్త డ్రామా మొదలు పెట్టారా అని నిలదీశారు. తమిళనాడు, కేరళ ప్రజలు విజ్ఞులు.. కుట్ర కాల్చి వాత పెట్టేందుకు సిద్ధమయ్యారన్నారు. మీకు, కాంగ్రెస్ పార్టీకి మహిళలంటే ద్వేషం.. అందుకే 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో మహిళలకు 33 శాతం సీట్లు ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు కాపీలను చింపిన ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీలతో అంట కాగుతున్నారన్నారు. మీరెన్ని కుట్రలు చేసినా, విభజన రాజకీయాలు చేసినా మహిళా రిజర్వేషన్లను అమలు చేస్తామని సంజయ్ స్పష్టం చేశారు.

# స్పీకర్‌ను డిక్టేట్ చేయొద్దు

**మొదటిపేజీ తరువాయి**

చేయాలనుకుంటే ఎలా అని ప్రశ్నించారు. బుధవారం శాసనసభలో మంత్రులు బిల్లులు పెట్టే సమయంలో అభ్యంతరాలు వ్యక్తం చేసిన బీఆర్ఎస్ సభ్యుల తీరుపై ఆయన ఘాటుగా స్పందించారు. ఆ పార్టీ శాసనసభా నాయకుడిగా ఎన్నికయ్యేందుకు హరీశ్ రావుకు అన్ని అర్హతలు ఉన్నాయన్నారు. ఆ పదవికి ఆయన సమర్థుడని కితాబు ఇచ్చారు. డిప్యూటీ లీడర్‌గా ఆయన కోరినప్పుడల్లా మైక్ ఇవ్వడం సాధ్యం కాదని చెప్పారు. లెజిస్లేచర్ పార్టీ లీడర్ స్థానంలో కూర్చుంటే ఎప్పుడంటే అప్పుడు మాట్లాడటానికి అవకాశం ఉంటుందని హరీశ్‌రావును ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

# చదువు పదో తరగతి.. వృత్తి డెంటిస్ట్




**మల్కాజిగిరి, సిరి న్యూస్:** ఎటువంటి అర్హతలు లేకుండా ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న నకిలీ దంత వైద్యుడిని నేరేడ్ మెట్ పోలీసులు, రాచకొండ ఎస్ఓటీ, మల్కాజిగిరి పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రమేష్ కుమార్ గుప్తా బీడీఎస్ అర్హత లేకపోయినా రెండు దశాబ్దాలుగా డెంటల్ క్లినిక్ నిర్వహిస్తున్నట్లు విచారణలో తేలింది. పోలీసుల వివరాల ప్రకారం, ఓల్డ్ నేరేడ్మెట్ పాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కింద అంజాలిక డెంటల్ క్లినిక్ అనుమతులు లేకుండా నడుస్తున్నట్లు సమాచారం అందింది. పోలీసులు ఆకస్మిక తనిఖీ నిర్వహించి రమేష్ కుమార్ బీడీఎస్ అర్హతలు లేకుండా ఈ క్లినిక్ నడుపుతున్నట్లు గుర్తించారు. బీడీఎస్ డాక్టర్ గా ప్రచారం చేసుకుంటూ అమాయక రోగులను మోసం చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. రమేష్ కనీసం పదో తరగతి కూడా పూర్తి చేయలేదని, అయినప్పటికీ 20 యేళ్లుగా క్లినిక్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.ఎవరికి అనుమానం రాకుండా రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజాము వరకు మాత్రమే క్లినిక్ నడిపేవాడని పోలీసులు తెలిపారు. ఎస్ఐ చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు. అర్హతలు లేకుండా వైద్యం చేయడం తీవ్రమైన నేరమని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు.

# బాధితులకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి



**సిరి న్యూస్, రంగారెడ్డి జిల్లా బ్యూరో:** హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని భాగ్యనగర్ కాలనీ కి చెందిన జాలయ్య వైద్య చికిత్స నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసు కోగా మంజూరైన 44 వేల రూపాయల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ అందచేశారు. తాజా తో కలిసి బాధిత కుటుంబానికి అంద చేసిన ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని, ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని పునరుద్ఘాటించారు . అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు , అభాగ్యులకు అండగా..సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని ఈ సందర్భంగా తెలియచేశారు. పేద మధ్యతరగతి ప్రజలకు ఆసుపత్రిలో బిల్లులు కట్టలేని పరిస్థితిలో ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ ఆర్థిక సాయంని అందిస్తుందని దీనిలో భాగంగానే నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటివరకు ఎన్నో వందలాది కుటుంబాలను ఆదుకున్నామని తెలిపారు. గతంలో ఉన్న బిల్లులకు అనుగుణంగానే ప్రస్తుతం ఆర్థిక సాయం అందిస్తుందని దానిని మరింత పెంచేలా కృషి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి త్వరలోనే కలిసి వినతి పత్రాన్ని అందజేస్తానని ,మరింత ఆర్థిక సహాయం పెంచితే పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది అని అన్నారు. ఈ సందర్భంగా వైద్య చికిత్సకు సహకారం అందించిన గాంధీ కి బాధితుల కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు ,కాంగ్రెస్ నాయకులు రఘునందన్ రెడ్డి, బ్రిక్ శ్రీనివాస్, జిల్లా గణేష్, పోతుల రాజేందర్, అష్రాఫ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇంధన సరఫరాపై ప్రభుత్వం భరోసా

**మొదటిపేజీ తరువాయి**

స్పష్టం చేసింది. అవసరమైన సరఫరా కోసం ఇప్పటికే పలు నౌకలు చేరుకున్నాయని, మరి కొన్ని రానున్నాయని తెలిపారు.

పశ్చిమాసియాలో పరిస్థితులు ఉద్రిక్తంగా ఉన్నప్పటికీ భారత పౌరుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. విదేశాల్లో ఉన్న భారతీయులకు అవసరమైన సహాయం అందించేందుకు రాయబార కార్యాలయాలు సిద్ధంగా ఉన్నాయని, అవసరమైతే తరలింపు చర్యలకు కూడా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వెల్లడించింది. దేశ భద్రత, ఇంధన సరఫరా విషయంలో అన్ని స్థాయిల్లో చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం సమావేశంలో వివరించింది.



# ఘట్కేసర్ సర్కిల్ లో సుర్వి హాస్పిటల్

**నాగారం, సిరి న్యూస్:** మల్కాజిగిరి కార్పొరేషన్ ఘట్కేసర్ సర్కిల్ పోచారం డివిజన్ చౌదరిగూడాలో నూతనంగా ఏర్పాటు చేసిన సుర్వి హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ హాజరై హాస్పిటల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం చాలా ముఖ్యమని, ఈ ప్రాంత ప్రజలకు అందుబాటు ధరల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని హాస్పిటల్ నిర్వాహకులకు సూచించారు. ఇలాంటి ఆసుపత్రులు స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీ వాసులు, హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. హాస్పిటల్ ప్రారంభం సందర్భంగా నిర్వాహకులు ముఖ్య అతిథిని శాలువాతో సన్మానించారు. కాగ స్థానిక ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం పట్ల ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



# కీసర లో భూ బకాసురుల ఆటకట్టు

- ఎఎస్ఐ సహా పలువురు అరెస్ట్

**నాగారం, సిరి న్యూస్:** అమాయకుల భూములపై కన్నేసి నకిలీ పత్రాలతో కాజేయాలని చూసిన భారీ భూకబ్జా ముఠాను కీసర పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఈ ముఠాలో ఒక ఏఎస్ఐ స్థాయి పోలీసు అధికారి కూడా ఉండటం గమనార్హం. మరణ ధృవీకరణ పత్రాల నుంచి కుటుంబ సభ్యుల సర్టిఫికెట్ల వరకు అన్నింటినీ ఫోర్జరీ చేస్తూ యజమానులకు తెలియకుండానే ఆస్తులను రిజిస్ట్రేషన్ చేస్తున్న ఇద్దరు ప్రధాన నిందితులతో సహా పలువురిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం, ఈ నెల 16, 17 తేదీల్లో కేశబోయిన రమాదేవి, మదాను మాధురి అనే మహిళలు తమ భూములను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఫోర్జరీ పత్రాలతో ఇతరులకు బదలాయించారని కీసర పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి లోతుగా దర్యాప్తు చేపట్టారు. అక్రమ మార్గం ఇలా ఈ ముఠా ప్రధానంగా ఖాళీగా ఉన్న ప్లాట్లను, యజమానులు అందుబాటులో లేని భూములను లక్ష్యంగా చేసుకుంటుంది. మొదట అసలు యజమానుల వివరాలు సేకరించి, వారు చనిపోయినట్లు నకిలీ 'డెత్ సర్టిఫికేట్లు' సృష్టిస్తారు. ఆపై నకిలీ వారసులను పుట్టించి, గిఫ్ట్ సెటిల్‌మెంట్ డీడ్లు, సేల్ డీడ్ల ద్వారా భూములను తమ అనుచరుల పేరిట రిజిస్ట్రేషన్ చేయిస్తారు. రెండు వేర్వేరు కేసుల్లో పోలీసులు నిందితులను గుర్తించారు. మొదటి కేసులో కనకాటి లింగయ్య గౌడ్ (ఏఎస్ఐ), ప్రవీణ్ రెడ్డి, మోడెమ్ సంపత్, కాంబ్లే దీపలను అరెస్ట్ చేయగా రెండో కేసులో ఉప్పల వేణు, దొనపాటి వెంకట్ రెడ్డి, గుండిగ జ్యోతి, మదాను ఇన్నయ్యలను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి ఫోర్జరీ చేసిన పత్రాలు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. "భూముల కొనుగోలు విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే లావాదేవీలు జరపాలి అని మల్కాజిగిరి డిసిపి శ్రీధర్ సూచించారు. కేసును త్వరితగతిన ఛేదించిన జవహర్‌నగర్ ఏసీపీ చక్రపాణి, కీసర సీఐ ఆంజనేయులు, ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి బృందాన్ని ఆయన అభినందించారు. నిందితులను రిమాండ్‌కు తరలించామని, పరారీలో ఉన్న మిగిలిన వారి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.




# తల్లిని చంపి ఇంట్లోనే పూడ్చి పెట్టింది

**సికింద్రాబాద్, సిరి న్యూస్:** హైదరాబాద్‌లోని జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో తన ప్రేమ వ్యవహారానికి అడ్డుపడుతోందన్న కోపంతో, కన్నతల్లిని కూతురే ప్రియుడితో కలిసి హత్య చేసిన ఉదంతం ఏడాది తర్వాత బయటపడింది. నిందితురాలు ఇషికా, తన ప్రియుడు మౌంటీ రాజ్‌పుత్‌తో కలిసి ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించారు. ఏడాది క్రితం తన తల్లి కనిపించడం లేదని, ఇంట్లోని బైక్ కూడా మిస్ అయ్యిందని ఇషికా పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినప్పటికీ ఎలాంటి ఆచూకీ లభించలేదు. అయితే, ఈ ఏడాది కాలమంతా నిందితులు ఇద్దరూ ఏమీ తెలియనట్లుగా నటించారు. తల్లి మృతదేహాన్ని ఇంట్లోనే పాతిపెట్టి, దానిపై ఎవరికీ అనుమానం రాకుండా జాగ్రత్త పడ్డారు. మంగళవారం నిందితుడు మౌంటీ రాజ్‌పుత్, మృతురాలికి చెందిన బైక్‌ను విక్రయించేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో అనుమానం వచ్చిన కొందరు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా, అసలు విషయం బయటపడింది.

# భూభారతి-భూముల రిసర్వే



**తూప్రాన్ మార్చ్ 25 సిరి న్యూస్**

తూప్రాన్ మండలంలోని మల్కాపూర్ గ్రామంలో బుధవారం రోజు రెవెన్యూ అధికారులు భూభారతి-భూముల రిసర్వేపై మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు సుమారు 100 సంవత్సరాల తర్వాత భూముల రీ సర్వే జరుగుతున్నట్లు తూప్రాన్ ఆర్డీవో జయచంద్ర రెడ్డి తెలిపారు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని గ్రామస్తులు విజయవంతం చెయ్యాలని ఆయన సూచించారు ఈ సందర్భంగా పలువురు రైతులు అడిగిన ప్రశ్నలకు జిల్లా సర్వేయర్ కిషన్ ఆర్డీవో జయ చంద్రారెడ్డి తాసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి వివరించారు కార్యక్రమంలో తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఉప సర్పంచ్ స్వామి పాలకవర్గ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు

# సేవాలాల్ పుణ్యక్షేత్రం రాజధానిలో ఏర్పాటు చెయ్యాలి జైపాల్ నాయక్




**తూప్రాన్ మార్చ్ 25 సిరి న్యూస్**

తూప్రాన్ లో సేవాలాల్ మహారాజ్ పుణ్యక్షేత్రం హైదరాబాద్ లో ఏర్పాటు కోసం గురువారం అసంబ్లీ ముట్టడికి వెళ్తున్న బంజారాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు తూప్రాన్ మున్సిపల్ కౌన్సిలర్ జైపాల్ నాయక్ తో పాటు మరికొందరిని బుధవారం రోజు పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ తరలించారు సేవాలాల్ మహారాజ్ పుణ్యక్షేత్రం లంబాడీల కోరిన చోట సేవాలాల్ మహారాజ్ పుణ్యక్షేత్రం ఏర్పాటు చేయాలని లంబాడీల ఆత్మగౌరవం ఉంటుందని సేవాలాల్ మహారాజ్ పుణ్యక్షేత్రం అడవిలోనే ఉండాల్నా హైదరాబాదులో ఉండకూడదా అని ఆలోచనతో మేము అన్ని కుల సంఘాల ఆధ్వర్యంలో ఈరోజు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్తుంటే తూప్రాన్ పోలీస్ స్టేషన్ లో అరెస్ట్ చేయడం జరిగింది అరెస్ట్ కుట్రలతో ఏవి చేసిన హైదరాబాదులోనే పుణ్యక్షేత్రం ఉండేలా చేయాలని లేని ఎడల ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని బంజారాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అన్ని కుల సంఘాలు ఆధ్వర్యంలో చర్చించి మల్లి కార్యచరణ ప్రకటిస్తామని జైపాల్ నాయక్ తెలిపారు

# వృద్ధ దంపతులపై సు త్తితో దాడి

- **5 తులాల బంగారం దోపిడీ. జంగరాయి గ్రామంలో**
- **సంఘటన....స్థలాన్ని పరిశీలించిన అదనపు ఎస్పీ మహేందర్...**



**రామాయంపేట, (జంగ రాయి ) మార్చి 25 (సిరి న్యూస్ )**



శంకరంపేట్ (ఆర్) పోలీస్ స్టేషన్ పరిధిలోని జంగరాయి గ్రామంలో మధ్యాహ్న సమయంలో దోపిడి ఘటన చోటుచేసుకుంది. గుర్తుతెలియని వ్యక్తి వృద్ధ దంపతులు అంజయ్య, సావిత్రి నివాసంలోకి ప్రవేశించి సుత్తితో దాడి చేసి, వారి వద్ద ఉన్న సుమారు 5 తులాల బంగారు ఆభరణాలను దోచుకుని బైక్‌పై పరారయ్యాడు.దాడిలో గాయపడిన దంపతులను స్థానికులు వెంటనే మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.ఘటనపై సమాచారం అందుకున్న మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ సంఘటన స్థలాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. దుండగులను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఘటనకు సంబంధించిన ఆధారాలను సేకరిస్తూ, నిందితులను త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని పేర్కొన్నారు.అదనపు ఎస్పీ గారి వెంట డియస్పి తూప్రాన్ నరేందర్ గౌడ్, సీఐ వెంకట రాజా గౌడ్, ఎస్సై నారాయణ గౌడ్, ఉన్నారు.

# శ్రీ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని హైదరాబాద్ నడిబొడ్డున ఏర్పాటు చేయాలి

- **బంజారా సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోతిలాల్ లంబాడి సేన రాష్ట్ర అధ్యక్షులు బాలునాయక్**

**మేడ్చల్ మల్కాజ్గిరి (సిరి న్యూస్ ) మార్చి 25**



అసెంబ్లీ' ముట్టడించిన గిరిజన నేతలు తెలంగాణ రాజధాని హైదరాబాద్ నడిబొడ్డున గిరిజనుల ఆరాధ్య దైవం, ఆధ్యాత్మిక గురువు సేవాలాల్ మహారాజ్ గారి విగ్రహాన్ని వెంటనే ఏర్పాటు చేయాలలి డిమాండ్ చేస్తూ, "సేవాలాల్ బంజారా సంఘం,గిరిజన జన సమితి, లంబాడి హక్కుల పోరాట సమితి,లంబాడి సేన, ఆధ్వర్యంలో 'చలో అసెంబ్లీ' ముట్టడి.ఈ సందర్భంగా గిరిజన జన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు వినోద్ నాయక్ సేవాలాల్ బంజారా సంఘం, రాష్ట్ర అధ్యక్షులు,మోతిలాల్ నాయక్, లంబాడి సేన, రాష్ట్ర అధ్యక్షులు, బాలు నాయక్ మాట్లాడుతూ, గిరిజన సంస్కృతికి ఆత్మగౌరవానికి ప్రతీక అయిన సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని నగరంలో కాకుండా, ఎక్కడో అడవి ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామంటే గిరిజన జాతి సహించదని హెచ్చరించారు.రాజధానిలో సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని హైదరాబాద్‌లోని ప్రధాన కూడలిలో ప్రభుత్వమే అధికారికంగా ఏర్పాటు చేయాలి.ఆత్మగౌరవ పోరాటం: కోట్ల మంది గిరిజనుల మనోభావాలను గౌరవించి, వారి సంస్కృతికి తగిన గుర్తింపు ఇవ్వాలి.ప్రభుత్వ వైఖరి: విగ్రహ ఏర్పాటు విషయంలో ప్రభుత్వం కాలయాపన చేస్తే, భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని "వినోద్ నాయక్ "మోతిలాల్ నాయక్ బాలు నాయక్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో, సేవాలాల్ బంజారా సంఘం "గిరిజన జన సమితి లంబాడి సేన రాష్ట్ర కమిటీ సభ్యులు,గిరిజన సంఘులు వివిధ జిల్లాల నాయకులు మరియు పెద్ద సంఖ్యలో గిరిజన యువత పాల్గొన్నారు.

# ఇంద్రేశంలో తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ 54వ బ్రాంచ్ ప్రారంభం






**పటాన్ చెరు, మార్చి,25, (సిరి న్యూస్):**

పటాన్ చెరు మండలం ఇంద్రేశం మునిసిపల్ పరిధిలో తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ నూతనంగా 54వ బ్రాంచ్‌ను బుధవారం నాడు ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బ్యాంక్ చైర్మన్ ప్రతాపరెడ్డి, సంగారెడ్డి రీజనల్ మేనేజర్ సమతా పిన్నెల్లి హాజరై నూతన శాఖను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్‌కు మొత్తం 753 బ్రాంచ్‌లు ఉన్నాయని, సంగారెడ్డి జిల్లాలో ఇప్పటివరకు 53 బ్రాంచ్‌లు ఉండగా, ఇది 54వ బ్రాంచ్‌గా ప్రారంభమైందని తెలిపారు.నూతనంగా ప్రారంభించిన ఈ శాఖలో మొదటి రోజే గృహ నిర్మాణం, వరి కోత యంత్రం, జెసిబి కోసం రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. జిల్లాలో సుమారు 50 శాతం బ్యాంకింగ్ లావాదేవీలు తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ ద్వారానే జరుగు తున్నాయని పేర్కొన్నారు. సామాన్య ప్రజలకు సులభంగా బ్యాంకింగ్ సేవలు అందించేందుకు కేవలం రూ.500తో ఖాతా ప్రారంభించే అవకాశం కల్పిస్తున్నామని, వ్యవసాయాధారిత యంత్రాలకు 80 శాతం వరకు రుణాలు మంజూరు చేస్తున్నామని వివరించారు. అదే విధంగా గృహ నిర్మాణ రుణాలను కేవలం 7.20 శాతం వడ్డీతో, డిపాజిట్ పథకాల పై 8 శాతం వరకు వడ్డీ అందిస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఎల్ల వేళలా తోడ్పడుతుందని, ప్రజలు బ్యాంక్ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ హర్ష, సిబ్బంది, నాబార్డ్ అధికారులు, రీజనల్ సిబ్బంది, బ్యాంక్ వినియోగదారులు పాల్గొన్నారు.

# సేవాలాల్ పుణ్యక్షేత్రం రాజధానిలో ఏర్పాటు చెయ్యాలి జైపాల్ నాయక్





**తూప్రాన్ మార్చ్ 25 సిరి న్యూస్**

తూప్రాన్ లో సేవాలాల్ మహారాజ్ పుణ్యక్షేత్రం హైదరాబాద్ లో ఏర్పాటు కోసం గురువారం అసంబ్లీ ముట్టడికి వెళ్తున్న బంజారాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు తూప్రాన్ మున్సిపల్ కౌన్సిలర్ జైపాల్ నాయక్ తో పాటు మరికొందరిని బుధవారం రోజు పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ తరలించారు సేవాలాల్ మహారాజ్ పుణ్యక్షేత్రంలంబాడీల కోరిన చోట సేవాలాల్ మహారాజ్ పుణ్యక్షేత్రం ఏర్పాటు చేయాలని లంబాడీల ఆత్మగౌరవం ఉంటుందని సేవాలాల్ మహారాజ్ పుణ్యక్షేత్రం అడవిలోనే ఉండాల్నా హైదరాబాదులో ఉండకూడదా అని ఆలోచనతో మేము అన్ని కుల సంఘాల ఆధ్వర్యంలో ఈరోజు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్తుంటే తూప్రాన్ పోలీస్ స్టేషన్ లో అరెస్ట్ చేయడం జరిగింది అరెస్ట్ కుట్రలతో ఏవి చేసిన హైదరాబాదులోనే పుణ్యక్షేత్రం ఉండేలా చేయాలని లేని ఎడల ఉద్యమాన్ని ఉదృతం చేస్తామని బంజారాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అన్ని కుల సంఘాలు ఆధ్వర్యంలో చర్చించి మల్లి కార్యచరణ ప్రకటిస్తామని జైపాల్ నాయక్ తెలిపారు

# జంటనగరాల్లో నిన్నటివరకు "గ్యాస్ "నగరంలో నేడు పెట్రోల్ సంక్షోభం

- **వదంతులు నమ్మి ..పెట్రోల్ డీజీల్ కొనుగోలుకు ఎగబడుతున్న జనం !!**

**హైదరాబాద్ ,మార్చి 25,(సిరి న్యూస్ )**

రాష్ట్రంలో నిన్న మొన్నటి వరకు గ్యాస్ కోసం జనం ఎగబడ్డారు. ప్రస్తుతం రాష్ట్రంలో పెట్రోల్ సంక్షోభం ముంచు కోస్తుందనే భయంతో జనం పెట్రోల్ బంకుల్లో క్యూ కడుతున్నారు. ఇప్పటికే నగరంలో 60 నుంచి 70 శాతం బంకుల్లో పెట్రోల్ నిల్వలు లేవని మూత వేసుకున్నారు. ఇక మిగిలిన బంకుల్లో పెట్రోల్ , డిజీల్ నిల్వలు ఉండడంతో ప్రతి పెట్రోల్ బంకులో వాహనాలతో కిక్కిరిసి పోయింది. పెట్రోల్, డీజిల్ కొరతతో మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక బంకులు మూతపడగా.. ఎక్కడ చూసినా బంకుల ముందు నోస్టాక్ బోర్డులే దర్శనమిచ్చాయి. బుధవారం కూడా అలాంటి పరిస్థితే కనిపించడంతో పెట్రోల్, డీజిల్ దొరకదే మోనని వాహనదారులు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ క్రమంలో బంకుల వద్దకు పరుగులు తీస్తున్నారు. తీసి ఉన్న బంకుల్లో పెట్రోల్ కోసం వాహనదారులు బారులు తీరారు. దొరికిన చోట తమ వాహనాల్లో ట్యాంక్‌ఫుల్ చేయించుకుంటు-న్నారు. దీనికి తోడు బాటిళ్లలోనూ స్టాక్ పెట్టు-కుంటు-న్నారు.

**కంపెనీల అనధికార కోతలు....**

హైదరాబాద్ మహానగరంలో 1200లకు పైగా పెట్రోల్ బంకులు ఉండగా, రోజూ సుమారు 15నుంచి 16 లక్షల లీటర్ల పెట్రోల్, 18 లక్షల లీటర్ల డీజిల్ విక్రయాలు జరుగుతాయి. పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియా దేశాలపై గ్యాస్, పెట్రోల్ వనరుల కోసం ఆధారపడ్డ దేశాలు అతలకుతలమవుతున్నాయి. యుద్ధం నేపథ్యంలో పెట్రోల్ , గ్యాస్ సరిపడేంత రావడం లేదనే ఒక ప్రచారం ఉండగా, పెట్రోల్, గ్యాస్‌కు ఏలాంటి ఇబ్బంది లేదని ప్రభుత్వ వర్గాలు తెలియజేయడం గమనార్హం. అయితే డిమాండ్‌కు తగ్గట్టు- పెట్రోల్, డీజిల్‌ను ఆయిల్ కంపెనీలు సరఫరా చేయడం లేదని బంకుల నిర్వాహకుల నుంచి ఆరోపణలు ఉన్నాయి. ఇందులో భాగంగానే స్టాక్ సరఫరాలో అనధికారిక కోతలు విధిస్తున్నాయని చెప్పారు. అధికారికంగా ఎలాంటి ఆదేశాలు లేకపోయినా సరఫరాలో అంతర్గత కోతలు పెడుతున్నట్టు-గా చెప్తున్నారు. ఇందుకోసం పలురకాల షరతులు విధిస్తున్నారని చెప్తున్నారు. మొన్నటివరకు స్టాక్ కావాలంటే అడ్వాన్స్ పేమెంట్ చేయాలని ఆదేశించారని, ఆ తర్వాత స్టాక్ కావాలంటే ఒకరోజు ముందే పేమెంట్ చేయాలన్నారని, తాజాగా తామే ఆన్‌లైన్ మానిటరింగ్ చేసి.. సరఫరా చేస్తామని ఆయిల్ కంపెనీలు చెప్తున్నాయని బంకుల నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఇందులో భాగంగానే ఒక బంకులో స్టాక్ పూర్తిగా ఖాళీ అయ్యే పరిస్థితిలోనే సరఫరా చేస్తున్నట్టు- తెలిపారు. ఒకవేళ ఏదైనా కారణాలతో అప్పటికీ స్టాక్ రాకపోతే బంకును మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని చెప్తున్నారు. దీంతో పాటు- ఎప్పటికప్పుడు సేల్, స్టాక్ వివరాలు పంపాలని బంకుల యాజ మాన్యాలకు ఆదేశాలు జారీ చేసినట్టు-గా తెలిసింది.

**పెట్రోల్, డిజీల్‌కు డోకా లేదు... సరిపడా నిల్వలు ఉన్నాయి.**

**తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ వెల్లడి...**

పెట్రోల్, డీజిల్ కొరతతో రాష్ట్రవ్యాప్తంగా వాహనదారుల ఆందోళన నేపథ్యంలో తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ స్పందించింది. పెట్రోల్, డీజిల్ కొరత ఉందన్న వదంతులు పూర్తిగా అవాస్తవమని కొట్టిపారేసింది. సోషల్‌మీడియాలో వస్తున్న ప్రచారాలతో తప్పుడు ప్రచారాల కారణంగా ప్రజలు అనవసరంగా పెట్రోల్ బంకులను పరుగులు తీస్తూ, ట్యాంకులు నింపుకుంటు-న్నారని తెలిపింది. పెట్రోల్ బంకుల ముందు నోస్టాక్ బోర్డులు కనిపించడానికి ప్రధాన కారణం తప్పుడు వదంతులు నమ్మి ఒకేసారి జనాలు ఎగబడటమేనని తెలిపారు. అందరూ తమ వాహనాల కోసం పెద్ద ఎత్తున ఇంధనం కొనుగోలు చేస్తుండటంతో కూడా కొరత ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ భయాందోళనల కారణంగా సాధారణ స్థాయి కంటే 2.5 నుంచి 3 రెట్లు- అధికంగా అమ్మకాలు జరుగుతున్నాయని తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ తెలిపింది. దీంతో కొన్ని ప్రాంతాల్లో తాత్కాలికంగా ఇంధన నిల్వలు తగ్గినట్లు- కనిపిస్తున్నాయని పేర్కొంది. రాష్ట్రంలో ఎలాంటి ఇంధన కొరత లేదని స్పష్టంచేసింది. హెచ్‌పీసీఎల్, ఐవోసీఎల్, బీపీసీఎల్ సంస్థల వద్ద తగినంత నిల్వలు ఉన్నాయని.. సరఫరా వ్యవస్థ సక్రమంగా కొనసాగుతుందని తెలిపింది.

**పెట్రోల్ నిల్వ చేస్తే ప్రమాదం ----**

పెట్రోల్ లేదా డీజిల్‌ను క్యాన్లలో నిల్వ చేయడం ప్రమాదకరమని.. ఇది పీఈఎస్‌వో నిబంధనలకు విరుద్ధమని పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ హెచ్చరించింది. ఇంధనాన్ని తప్పుగా నిల్వ చేయడం వల్ల అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం తెలిపింది. భయాందోళనలతో అధికంగా ఇంధనాన్ని కొనుగోలు చేసి నిల్వ చేసుకోవద్దని అసోసియేషన్ ప్రతినిధులు హెచ్చరిస్తున్నారు.

# ప్రతి ఒక్కరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- దోమడుగు అభివృద్ధికి సంపూర్ణ సహకారం.
- ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి
- 79 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**గుమ్మడిదల, మార్చి 25 ( సిరి న్యూస్):**



79 లక్షల వ్యయంతో సిసి రోడ్లు


ప్రతి ఒక్కరూ గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి అని పటాన్ చెరువు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలోని దోమడుగు వార్డులో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డును అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిది ద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. గుమ్మడిదల మున్సిపల్ అభివృద్ధి కోసం ఇప్పటికే రూ.15 కోట్ల నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే ఆ పనులకు కూడా శంకుస్థాపనలు చేపట్ట నున్నట్లు వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. గ్రామాల అభివృద్ధిలో పరిశ్రమల యాజమాన్యాలు అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొంటూ, రాబోయే రోజుల్లో కూడా అభివృద్ధి కార్యక్రమాలలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ సంధ్యా గోవర్ధన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ దశరథ్, కౌన్సిలర్లు రాజశేఖర్, సోనీ, పద్మ, విజయలక్ష్మి, సంజీవరెడ్డి, కత్తుల రమేష్, రాజిరెడ్డి, సురభి కుమార్ గౌడ్, హెట్రో డ్రగ్స్ పరిశ్రమ ప్రతినిధులు సుధాకర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, సిజిఆర్ ఫస్ట్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, విజయ్ భాస్కర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, ఆలేటి శ్రీనివాస్ రెడ్డి, శేఖర్ రెడ్డి, హుస్సేన్,మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని దోమడుగు వార్డులో హెట్రో డ్రగ్స్ పరిశ్రమ సౌజన్యంతో రూ.79 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అంతర్గత మురుగునీటి కాలువలు, రక్షిత మంచినీటి పైపులైన్ల నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు.

# దోమడుగులో మహిళా సంఘ భవనం ఏర్పాటు చేయండి

- మున్సిపల్ చైర్మన్ కు వినతిపత్రం ఇచ్చిన మహిళా సంఘాల సభ్యులు

**గుమ్మడిదల, మార్చి 25 ( సిరి న్యూస్):**



గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు గ్రామ మహిళా సంఘాల సభ్యులు బుధవారం మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. గ్రామంలో ఉన్న మహిళా సంఘాలకు ప్రత్యేక భవనం లేకపోవడంతో ఎదుర్కొంటున్న ఇబ్బం దులను తెలియజేస్తూ వినతిపత్రాన్ని సమర్పించారు. గ్రామంలో మొత్తం 32 మహిళా సంఘాలకు చెందిన 320 మంది సభ్యులు సమావేశాలు నిర్వహిం చుకోవడానికి తగిన భవనం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ప్రస్తుతం వినియోగంలో ఉన్న భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల సమావేశాలు నిర్వహించడం కష్టసాధ్యంగా మారిందని పేర్కొన్నారు. మహిళల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని సౌకర్యాలతో కూడిన నూతన మహిళా సంఘ భవనాన్ని నిర్మించాలని చైర్మన్‌ను కోరారు. దీనిపై స్పందించిన మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ నూతన భవన నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు వెంకట్రాం రెడ్డి, శేఖర్ గౌడ్, మహిళా సంఘ సభ్యులు అనురాధ, శారదమ్మ, స్వప్న, మమత, అఖిల తదితరులు పాల్గొన్నారు.

# నల్లవల్లి గ్రామ సమస్యలపై కలెక్టర్‌కు వినతి

- అంగన్వాడి కేంద్రం, రైతు వేదిక, పశువుల ఆసుపత్రి నిర్మాణానికి విజ్ఞప్తి

**గుమ్మడిదల, మార్చి 25 ( సిరి న్యూస్):**



గుమ్మడిదల మండల పరిధిలోని నల్లవల్లి గ్రామంలో నెలకొన్న పలు ప్రాథమిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని గ్రామ సర్పంచ్ కొరివి రాణి సురేష్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం సమర్పించారు. కలెక్టర్ గ్రామ పర్యటనకు వచ్చిన సందర్భంగా ఈ వినతిని అందజేస్తూ గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో రైతులు అధిక సంఖ్యలో పంటలు పండిస్తున్నప్పటికీ సమావేశాలు నిర్వహించుకునేందుకు రైతు వేదిక లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తక్షణమే రైతు వేదికను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే గ్రామంలో ప్రస్తుతం ఉన్న అంగన్వాడి కేంద్రం సరిపోకపోవడంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని మరో అంగన్వాడి కేంద్రాన్ని ఏర్పాటు చేసి చిన్నారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలోని పశువుల ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరడంతో ఉపయోగకరంగా లేకపోవడం వల్ల ఇబ్బందిగా మారిందని తెలిపారు. ఆ స్థలంలో నూతన భవనాన్ని నిర్మించి, పశువైద్య సేవలు అందుబాటులో ఉండేలా రెగ్యులర్ డాక్టర్‌ను నియమించాలని కలెక్టర్‌ను కోరారు. గ్రామాభివృద్ధికి సంబంధించిన ఈ సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని సర్పంచ్, గ్రామ ప్రజలకు జిల్లా కలెక్టర్ వినతిపత్రంలో కోరారు.

# నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం





- క్యాసారం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయ నిర్మాణానికి 15 లక్షల రూపాయల భారీ విరాళం
- జయ జయ ధ్వనాల మధ్య విగ్రహ ప్రతిష్టాపన
- పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు, మార్చి 25, (సిరి న్యూస్):**

పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి మరో మారు తన దైవభక్తిని చాటుకున్నారు. నియోజకవర్గంలో పరమత సహనాన్ని పెంపొందిస్తూ సొంత నిధులతో దేవాలయాలు, మసీదులు. చర్చిల నిర్మాణానికి సొంత నిధులు కేటాయిస్తూ ప్రతి ఒక్కరిలో భక్తి భావం పెంపొందిస్తున్నారు. ఈ నేపథ్యంలో పటాన్ చెరు మండలం క్యాసారం గ్రామంలో శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం నిర్మాణానికి 15 లక్షల రూపాయల సొంత నిధులు అందించి తన భక్తి భావాన్ని చాటుకున్నారు. బుధవారం నిర్వహించిన స్వామివార్ల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మల్లన్న స్వామి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లోనూ దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమం లో సీనియర్ నాయకులు దశరథరెడ్డి, కృష్ణ యాదవ్, ప్రభాకర్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు .

# మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ కు ఆహ్వాన పత్రికలను అందజేసిన ఆలయ కమిటీ





**(సిరి న్యూస్) మేడ్చల్ మల్కాజ్గిరి మార్చి 25**

శ్రీరామనవమి సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని పలు దేవాలయలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి సందర్భంగా హనుమాన్ ఆలయాల్లో నిర్వహించే సీతారాముల కల్యాణ ఉత్సవాలో ముఖ్య అతిథిగా పాల్గొని విజయవంతం చేయాలని భక్తులు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఆలయ కమిటీ సభ్యులు బస్తీ వాసులు పాల్గొన్నారు

# విద్యుత్ శాఖలో "సమ్మె "సైరన్ !

## ఒకే శాఖ ఒకే నిబంధన కోసం ఆర్టీసియన్ల పోరుబాట ..

**హైదరాబాద్ ,మార్చి25,సిరిన్యూస్ :**

తెలంగాణ విద్యుత్ శాఖలో అర్టీసియన్లు హక్కుల సాధన కోసం పోరుబాట పట్టనున్నారు.ఒకే సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు వేర్వేరు సర్వీస్ నిబంధనలు,జీతభత్యాల మధ్య అంతరం తో ఎన్నో విరుద్ధమైన నిబంధనలపై ఆర్టీసియన్లు గళమెత్తుతున్నారు.ఈ నెల 26వ తేదీన అన్ని డివిజన్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించనున్నారు.దక్షిణ మండల విద్యుత్ సంస్థ పరిధిలోని అన్ని జిల్లాల్లో ధర్నాను విజయవంతం చేసేందుకు గాను జాయింట్ యాక్షన్ కమిటీ కృషిచేస్తుంది.ఇప్పటికే అన్ని ప్రధాన యూనియన్ల మద్దతు కూడగట్టుకున్న జాక్ ఒక ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తోంది.గత ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సంస్థలో పనిచేస్తున్న 22వేల పైచిలుకు కార్మికులను రెగ్యూలర్ ఉద్యోగులుగా పరిగణిస్తూయాజమాన్యం 2017 ఉత్తర్వులు ఇచ్చింది.ఐతే అప్పట్లో అర్హతల ఆధారంగా గ్రేడ్ ల వారీగా నియామకాలు జరిపారు.గతంలో పనిచేస్తున్న రెగ్యూలర్ ఉద్యోగులుగా కాకుండా ఆర్టీసియన్ అనే కొత్త పేరుతో వీరిని క్రమబద్దీకరించారు.అత్యంత తక్కువ జీతం,సాధారణ సెలవుల్లో కోత,కారుణ్య నియామకాలలో అర్హతకు తక్కువగా నియమాకాలతో ఎన్నో ఇబ్బందికరమైన నిబంధనలు క్రమబద్దీకరణలో చోటుచేసుకున్నాయి.అప్పట్లో ఎన్నో పర్యాయాలు నిరసనలు వ్యక్తం చేసినా యాజమాన్యం స్పందించలేదు.కొత్త ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రికి,విద్యుత్ శాఖ మంత్రికి సైతం అన్ని యూనియన్లు ,జాక్ కలిసి విన్నవించినా ఫలితం దక్కలేదు.దింతో ఈ నెల 26వ తేదీన డివిజన్ కార్యాలయాల వద్ద ధర్నాలు,30 వ తేదీన సర్కిల్ కార్యాలయాల వద్ద జిల్లా కార్మికులు ధర్నా చేయనున్నారు. సమస్యలు పరిష్కారం కాకుంటే ఏప్రిల్8 నుండి నిరవధిక సమ్మె !!! ఆర్టీసియన్లకు ఏపీఎస్ఈబి నిబంధనలు వర్తించేలా,అర్హతల ఆధారంగా పోస్టుల్లో భర్తీచేసేవిదంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జాక్ డిమాండ్ చేస్తోంది.తమ డిమాండ్స్ కు ఒప్పుకోకుంటే ఏప్రిల్ 8నుండి నిరవధిక సమ్మె తప్పదని విద్యుత్ ఉద్యోగుల జాక్ తెలిపింది .

# సీఎస్ఈలో రావి దీప్తికి పీహెచ్.డీ.

**పటాన్ చెరు, మార్చి 25, (సిరి న్యూస్):**



హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థిని రావి దీప్తి డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'వాహనాల ఇంటర్నెట్ లోకి తెలివిగా చొరబడటాన్ని గుర్తించే వ్యవస్థ (స్మార్ట్ ఇంట్రూషన్ డిటెక్షన్ సిస్టమ్) కోసం సమర్థవంతమైన అభ్యాస-ఆధారిత విధానం'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న సీఎస్ఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.హిమబిందు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ దీప్తి పరిశోధన, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇంటర్నెట్ ఆఫ్ వెహికల్స్ (ఐవోవీ) పర్యావరణ వ్యవస్థలో చొరబాటు గుర్తింపు విధానాలను బలోపేతం చేయడానికి రూపొందించిన వినూత్న అభ్యాస-ఆధారిత ఫ్రేమ్ వర్కును అందిస్తుందని తెలిపారు. సైబర్ బెదిరింపులను గుర్తించడానికి, నిరోధించడానికి అధునాతన మెషిన్ లెర్నింగ్ పద్ధతులను అన్వయించడం ద్వారా అనుసంధానించిన వాహన నెట్ వర్కుల భద్రత, విశ్వసనీయత, సామర్థ్యాన్ని పెంచడం ఈ అధ్యయనం లక్ష్యమన్నారు. స్మార్ట్ ట్రాన్స్ పోర్టేషన్ సిస్టమ్ లలో సైబర్ సెక్యూరిటీ యొక్క పెరుగుతున్న ప్రాముఖ్యతను ఈ పరిశోధన ప్రముఖంగా ప్రస్తావిస్తోందని తెలిపారు. సురక్షితమైన, మరింత స్థితిస్థాపకంగా ఉండే తెలివైన చలనశీల మౌలిక సదుపాయాలు (మొబిలిటీ ఇన్ ఫ్రాస్ట్రక్చర్లను) నిర్మించడంపై విలువైన అవగాహనను కల్పిస్తుందన్నారు. డాక్టర్ దీప్తి సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, సీఎస్ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ షేక్ మహబూబ్ బాషా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలిపినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. పరిశోధనలో, వృత్తిపరంగా ఆమె మరిన్ని విజయాలను సాధించాలని వారు అభిలషించారు.

## నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ పనులు పూర్తి చేయాలి

### వంతెన పనులను పరిశీలించిన కలెక్టర్ హరీత



**సిరి న్యూస్ , జైనూర్:** వంతెన నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హరీత అన్నారు. జైనూర్–లింగాపూర్ రహదారిపై నిర్మాణంలో ఉన్న వంతెన పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. వంతెన నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించి, పనులను నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. వంతెన నిర్మాణం పూర్తయితే జైనూర్–లింగాపూర్ ప్రాంతాల మధ్య రాకపోకలు మరింత సులభతరం అవుతాయని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని, ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. పనులు నిర్ణీత గడువులోపు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే పనుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ అవసరమైన సాంకేతిక సహకారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## మహిళా శక్తి భవన్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**సిరి న్యూస్, మంచిర్యాల:** జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాల ప్రాంతంలో కొనసాగుతున్న మహిళా శక్తి భవన్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. బుధవారం మహిళా శక్తి భవన్ నిర్మాణ పనులను ఆకస్మికంగా సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. అందులో భాగంగా జిల్లాలోని మహిళా సమాఖ్యల కోసం నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి భవన్ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తూ నిర్ణీత గడువులోపు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పెట్రోల్ కొరతపై వదంతులు నమ్మవద్దు



**సిరి న్యూస్, తాండూర్:** పెట్రోల్ కొరత విషయంలో వస్తున్న వదంతులను ప్రజలు నమ్మవద్దని తెలంగాణ భారత్ పెట్రోలియం డీలర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి సురభి శరత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. యుద్ధ పరిస్థితులతో కొంత కాలం సరఫరాలో అంతరాయం ఏర్పడే అవకాశాలు ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పరిస్థితిని నిరంతరం గమనిస్తూ ఆయిల్ కంపెనీలతో కలిసి సరఫరాలో ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. కంపెనీలు క్రెడిట్ సదుపాయాన్ని తాత్కాలికంగా నిలిపివేయడం, వాహనదారులు అవసరం లేకున్నా అధిక మొత్తంలో ఇంధనం కొనుగోలు చేయడం ద్వారా పెట్రోల్ బంక్‌లలో నిల్వలు తగ్గుతున్నాయని తెలిపారు. వాహనదారులు అవసరమైనప్పుడు మాత్రమే ఇంధనం కొనుగోలు చేయాలని కోరారు. ప్రజలు అవసరానికి మించి ఇంధనం కొనుగోలు చేయడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని, దీనిపై ప్రజలు అవగాహనతో వ్యవహరించాలని సూచించారు. పౌర సరఫరా శాఖ, ఆయిల్ కంపెనీలు డీలర్లతో కలిసి కృత్రిమ కొరతను అధిగమించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నాయని వివరించారు.

## వారసంత వేలం పాట వాయిదా



**సిరి న్యూస్, తాండూర్:** మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రైల్వే బ్రిడ్జి సమీపంలో నిర్వహించే శనివారం వారసంతలో మేకలు, కూరగాయల వేలం పాట వాయిదా పడినట్లు కొత్తపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ ఆకుల వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి మెరుగు లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం సంత ఆవరణలో అధికారులు ఏర్పాటు చేసిన వేలం పాటలో ప్రభుత్వం నిర్దేశించిన టార్గెట్‌కు సరిపడే బిడ్లు రాకపోవడంతో వాయిదా వేయడం జరిగిందని పేర్కొన్నారు. మళ్లీ వేలం పాటను ఎప్పుడు నిర్వహించనున్నారో త్వరలో తెలియజేస్తామని తెలిపారు.

# విద్యారంగ బలోపేతంపై ప్రత్యేక దృష్టి

**• జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**సిరిన్యూస్, మంచిర్యాల:** విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం కాసిపేట మండల కేంద్రంలో గల కేజీబీవీని సందర్శించి అదనపు తరగతి గదులు, భోజనశాల నిర్మాణ పనులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ సింగ్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ పాఠశాలలో తాగునీరు, విద్యుత్, విద్యార్థులకు వేర్వేరుగా మూత్రశాలలు, ప్రహరీ గోడ ఇతర సౌకర్యాలను కల్పించి నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన విద్య బోధన అందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. పాఠశాలలో చేపట్టిన అదనపు తరగతి గదులు, భోజనశాల నిర్మాణ పనులు, అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. 8వ తరగతి విద్యార్థుల ద్వారా పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాల వివరాలు అడిగి తెలుసుకుని అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించారు. మండల కేంద్రంలో పారిశుధ్య నిర్వహణ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అంతర్గత రహదారులు, మురుగు కాలువల వ్యవస్థ, నివాస ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, రహదారులు, మురుగు కాలువలలో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించి శుభ్రంగా ఉంచాలని తెలిపారు. లబ్ధిదారులు తమకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్లను నిబంధనల ప్రకారం నిర్మించుకోవాలని, ఆ దిశగా అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం లంబడితండ (కె) గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామంలోని పల్లె దవాఖానను సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, పారిశుద్ధ్య నిర్వహణ, రిజిస్టర్లను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. పెద్దనపల్లి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి గ్రామంలో ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# 5వ తరగతి రాత పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ





**సిరి న్యూస్, కాగజ్నగర్:** సిర్పూర్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ, గురుకుల పాఠశాలలకు చెందిన విద్యార్థులు 5వ తరగతి రాత పరీక్షల్లో ప్రతిభ కనబర్చారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో పలువురు విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి సత్తా చాటారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు సైతం పోటీగా నిలిచి మెరుగైన ఫలితాలు సాధించడం విశేషంగా నిలిచింది. కష్టపడి చదవడం, ఉపాధ్యాయుల మార్గదర్శనం, తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఈ విజయాలు సాధ్యమయ్యాయని విద్యార్థులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందిస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల విజయంపై ఆనందం వ్యక్తం చేస్తూ పాఠశాలల బోధనని అభినందించారు. ఇలాంటి ఫలితాలు విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు.

# సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

**సిరి న్యూస్, బేల:** రైతు భరోసా నిధులు జమ కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. యువజన కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్ రెడ్డి ఆధ్వర్యంలో బేల మండలంలోని సాంగిడి గ్రామంలో గల పంట పొలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు చిత్రపటాలకు బుధవారం పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సామ రూపేష్ రెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా విషయంలో గత కొన్ని రోజులుగా బీజేపీ, టీఆర్ఎస్ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తూ రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం రైతులకు అండగా నిలుస్తూ మరోసారి రైతుల ఖాతాల్లో రైతుబంధు నిధులను జమ చేయించడం ద్వారా తన నిబద్ధతను నిరూపించారని పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రభుత్వాన్ని కొనసాగిస్తూ అన్నివర్గాల ప్రజలకు, ముఖ్యంగా నిరుద్యోగులు, ఉద్యోగులు, రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని చెప్పారు. అన్నం పెట్టే అన్నదాతలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ మద్దతుగా ఉంటుందని, రైతు పక్షపాతి ప్రభుత్వంగా నిలుస్తోందని అన్నారు. ఇకపై బీజేపీ, టీఆర్ఎస్ నాయకులు రైతు భరోసా విషయంలోనే కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేసి రైతులను తప్పుదోవ పట్టించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చంద్రశేఖర్, వార్డు సభ్యులు వినోద్, మంచికంటి సాయి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సామ నర్సారెడ్డి, ప్రకాష్ నవగరే, రవీందర్ పటేల్, సునీల్, సుధాకర్, దివాకర్ రెడ్డి, కైపెల్లి నర్సింగ్, రాకేష్, మారుతి, గణేష్ రెడ్డి, ప్రేమ్, గణేష్, విలాస్, రైతులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్‌లో మహిళా మార్ట్ ప్రారంభం



**సిరి న్యూస్, ఆదిలాబాద్:** మహిళా వికాస జిల్లా సమైక్య, గ్రామీణాభివృద్ధి సంస్థ సంయుక్తంగా జిల్లాలో తొలిసారిగా ఏర్పాటు చేసిన ఆదిలాబాద్ మహిళా మార్ట్‌ను జిల్లా కలెక్టర్ రాజర్షిషా మున్సిపల్ ఛైర్పర్సన్ బండారి అనూషతో కలిసి బుధవారం ప్రారంభించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మార్ట్‌లో కొనుగోళ్లను ప్రారంభించారు. అనంతరం మార్ట్‌లో ఏర్పాటు చేసిన వివిధ రకాల ఉత్పత్తులను కలెక్టర్, మున్సిపల్ ఛైర్పర్సన్ పరిశీలించారు. వారు స్వయంగా కొన్ని ఉత్పత్తులను కొనుగోలు చేసి మహిళలను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ మహిళలు ఉద్యోగ రంగంలోనే కాకుండా ఉపాధి రంగంలో కూడా రాణిస్తున్నారని తెలిపారు. మహిళలకు ఒక అవకాశం ఇస్తే నమ్మకంతో ఆ పనిలో విజయం సాధిస్తారని పేర్కొన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకం కింద జిల్లాలో తొలిసారిగా మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మహిళలు స్వయంగా తయారు చేసిన సుమారు 30 రకాల ఉత్పత్తులు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఆదివాసీ మహిళలతో పాటు మహిళా సంఘాల సభ్యులు తయారు చేసిన వివిధ వస్తువులను నాణ్యతతో, తక్కువ ధరలకు అందుబాటులో ఉంచడం జరిగిందని వివరించారు.

## మతం మారి రిజర్వేషన్లు పొందడం రాజ్యాంగ విరుద్ధం



**సిరి న్యూస్, తీర్యాణి:** మతం మార్చుకుని క్రైస్తవ జీవన విధానాన్ని అనుసరిస్తూనే ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల లబ్ధి పొందడం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీం కోర్టు స్పష్టం చేయడం హర్షణీయమని బీజేపీ తిర్యాణి మండల ఎన్నికల కన్వీనర్ పులి వెంకటేష్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ సర్టిఫికెట్ పొందుతూ క్రైస్తవ జీవన విధానాన్ని అనుసరిస్తున్న వారు వెంటనే తమ సర్టిఫికెట్లను రద్దు చేసుకోవాలని పేర్కొన్నారు. మతం మారిన తర్వాత కూడా రిజర్వేషన్లు పొందడం రాజ్యాంగాన్ని మోసం చేయడమేనని, ఇది సామాజిక న్యాయాన్ని అవమానించడంతో పాటు నిజమైన ఎస్సీ, ఎస్టీ హక్కుదారుల భవిష్యత్తును దోచుకోవడమేనని మండిపడ్డారు. ఈ విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చాలా కాలంగా కొనసాగుతున్న హక్కుల దుర్వినియోగానికి గట్టి చెంపపెట్టుగా నిలుస్తుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు మతమార్పిడి తర్వాత ఆటోమేటిక్‌గా కొనసాగవని కోర్టు స్పష్టంగా పేర్కొన్నదని చెప్పారు. ఒక చేత్తో క్రైస్తవ మతాన్ని స్వీకరించి, మరో చేత్తో ఎస్సీ, ఎస్టీ హక్కులను పట్టుకోవడం న్యాయం కాదని, అది నిజమైన దళిత, గిరిజన హక్కులపై దాడి అని వ్యాఖ్యానించారు. అలాగే తప్పుడు కుల ధృవపత్రాలు, మతం దాచిపెట్టి రిజర్వేషన్లను దుర్వినియోగం చేస్తున్న వారిపై ప్రత్యేక దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## ముగిసిన మాలి నేతల మైత్రి మిలన్ యాత్ర



**సిరి న్యూస్, ఆదిలాబాద్:** అఖిల భారతీయ మాలి మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే నేతృత్వంలో నిర్వహించిన ఉత్తర మధ్య భారత మైత్రి మిలన్ యాత్ర విజయవంతమైందని ఆయన తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 18న ఆదిలాబాద్ నుంచి బయల్దేరిన తొమ్మిది మంది మాలి సంఘ క్రియాశీల కార్యకర్తల బృందం 24న తిరిగి జిల్లా కేంద్రానికి చేరుకున్నట్లు తెలిపారు. ఈ యాత్రలో భాగంగా నాగపూర్, ఉజ్జయిని, కేదారేశ్వర్, ఆగ్రా, మథుర, ఢిల్లీ, అయోధ్య, ప్రయాగ్‌రాజ్ వంటి ప్రముఖ ప్రాంతాలను సందర్శించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అక్కడి స్థానిక మాలి సంఘ నాయకులను కలిసి వారి పరిస్థితులను తెలుసుకోవడంతో పాటు తెలంగాణలోని మాలి సమాజం స్థితిగతులను వివరించినట్లు తెలిపారు. మాలి సమాజానికి ఎస్టీ హోదా కల్పించే విషయంలో కేంద్ర ప్రభుత్వ వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లును ఆమోదించేందుకు తమ వంతు సహకారం అందించాలని వారు కోరినట్లు తెలిపారు. మైత్రి మిలన్ యాత్ర సందర్భంగా నాగపూర్‌లోని సంఘం నాయకులు బృందానికి ఘన స్వాగతం పలకడంతో పాటు సహాయ సహకారాలు అందించినట్లు వివరించారు.

# కో లివింగ్ హైదరాబాద్‌లో నయా ట్రెండ్

మారుతున్న జీవన విధానాలకు అనుగుణంగా తనను తాను మార్చుకోవడంలో హైదరాబాద్ ఎప్పుడూ ముందే ఉంటుంది. సొంత ఊర్లను వదిలి ఎంతో మంది యువత ఉపాధి,చదువు కోసం భాగ్యనగరానికి వస్తుంటారు. ఏపీ, తెలంగాణ నుంచే కాకుండా.. ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి కూడా వస్తారు. వారికి తగినట్లు వసతులను అందుబాటులో ఉంచడంలో భాగ్యనగరానికి మించిందే లేదని చెప్పవచ్చు. ఈ క్రమంలోనే వినడానికి కొత్తగా ఉన్న కో లివింగ్ అనే ఈ కల్చర్ ట్రెండ్‌గా మారింది. అసలు 'కో' లివింగ్ అంటే ఏమిటో తెలుసుకుందాం.

గత కొంతకాలంగా నగరంలో 'కో' లివింగ్ అనే కల్చర్ చాపకింద నీరులా విస్తరిస్తోంది. పెళ్లి కాకుండానే అమ్మాయిలు, అబ్బాయిలు కలిసి ఒకే హాస్టల్ లేదా ప్లాట్ తీసుకొని ఉండటాన్ని కో లివింగ్ అంటారు. ఎక్కడ చూసినా ఇవి విచ్చలవిడిగా కనిపిస్తున్నాయి. చిన్న చిన్న కాలనీలలో కూడా కో లివింగ్ సెంటర్‌లు పెడుతున్నారు. ఢిల్లీ, కోల్‌కత్తా, బెంగళూరు వంటి నగరాల్లో కూడా ఈ తరహా కో లివింగ్ స్టైల్ ఉండేది. అది ఇప్పుడు తెలుగు రాష్ట్రాలకు సైతం పాకింది.






ఇలాంటి కో లివింగ్ జంటలు హైదరాబాదులో కొన్ని వందల మంది ఉన్నారు. ఇదంతా ఏమిటంటే అంతర్జాతీయస్థాయికి నగరాన్ని చేర్చాలన్న పాలకుల ఆరాటంతో వచ్చిపడిన కొత్త కల్చర్ అనే చెప్పాలి. ఇలాంటి వాటి వల్ల యువత పెడదారి పడుతున్నారని పలువురు మండిపడుతున్నారు. ఇప్పటికే కొండాపూర్ ప్రాంతంలో ఓయో, కో లివింగ్ హాస్టల్స్ కు వ్యతిరేకంగా స్థానికులు నిరసనలు చేస్తున్నారు.

కో లివింగ్ పద్ధతిలో నిర్వాహకులు భారీగానే డబ్బులు వసూలు చేస్తున్నారు. బెంగుళూరులో అయితే కస్టమర్లు ఏ కంపెనీలో ఉద్యోగాలు చేస్తున్నారు ..? వాళ్ళ జీతాలు ఎంతని కూడా ఓనర్లు తెలుసుకుంటున్నారు. వివరాలు తెలుసుకోవటం కోసం కంపెనీల ఐడీల కార్డులు, మూడునెలల బ్యాంకు స్టేట్మెంట్లు కూడా చూస్తారు. వీటి ఆధారంగానే గదులకు అద్దెలు ఎంత వసూలు చేయాలో, డిపాజిట్లు ఎన్నినెలలు తీసుకోవాలో డిసైడ్ చేస్తారంట. కానీ హైదరాబాదులో కంపెనీ ఐడీ కార్డులు, బ్యాంకు స్టేట్మెంట్లు అడగకపోయినా ఇస్తున్న బస, వసతి సౌకర్యాలను బట్టి అద్దెలు వసూలు చేస్తున్నారు. లగ్జరీ హోటల్ స్థాయిలో సౌకర్యాలున్న గదులకు ఒక్కరు ఉంటే నెలకు రూ. 60 వేలు కూడా వసూలు చేస్తున్నారని సమాచారం.

సుప్రీం కోర్టు గైడ్ లైన్స్ ప్రకారం ఇద్దరు మేజర్లు కలిసి ఉండడంలో లీగల్‌గా ఎలాంటి తప్పులేదని చెబుతున్నా.. ఈ కో లివింగ్ రిలేషన్స్ ద్వారా కొన్ని క్రైమ్స్‌కు దారి తీసే అవకాశాలు ఉన్నాయి. అమ్మాయిలు, అబ్బాయిలు ఓకే రూమ్‌లో ఉన్నంత సేపు ఎలాంటి సమస్యలు ఉండవు కానీ.. వారి మధ్య మనస్పర్ధలు వచ్చినప్పుడు ఇద్దరూ కలిసి ఉన్న ఫొటోలు, వీడియోలతో బెదిరింపులకు దిగడం వంటి ఘటనలు తెరపైకి వస్తున్నాయి. వివాహం కాకుండానే అమ్మాయిలు, అబ్బాయిలు ఒకే గదిలో కలిసుండటం వల్ల సమాజానికి జరుగుతున్న నష్టాన్ని యువత అంచనా వేయటంలేదు. పెళ్ళిళ్ళు, పిల్లల విషయంలో అమ్మాయిల్లో మారుతున్న ఆలోచనలకు కో లివింగ్ తాజా ఉదాహరణ. వివాహం కాలేదనే తప్ప మిగిలిన అన్నీ విషయాలు జరిగిపోతున్నపుడు ఇక వివాహం గురించి అమ్మాయిలు, అబ్బాయిలు ఎందుకు ఆలోచిస్తారని పలువురు విశ్లేషకులు మండిపడుతున్నారు. ఏదేమైనా కో లివింగ్ కల్చర్ అనే సంస్కృతి సమాజానికి దీర్ఘకాలంలో నష్టం చేయటం ఖాయమనే వాదనలు వినిపిస్తున్నాయి.

తాజాగా గచ్చిబౌలి టీఎన్జీవో కాలనీ వాసులు చిన్న పిల్లలతో కలిసి కోలీవింగ్, ఓయో రూమ్స్, పీజీ హాస్టల్‌స్‌కు వ్యతిరేకంగా టీఎన్జీవో కాలనీలోని పీజీ హాస్టల్ ముందు నిరసన వ్యక్తం చేశారు. పీజీ హాస్టల్స్, ఓయో రూమ్స్, షేరింగ్ రూమ్స్ తో ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం అలాంటి వాటిని నిషేధించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి వాటి వల్ల ప్రశాంతత కరువయ్యిందని, వాటిని వెంటనే మూసివేయాలని విజ్ఞప్తి చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.







# వేగంగా బరువు తగ్గడానికి బెస్ట్ టిప్స్..!

బరువు తగ్గడం అనేది అనుకున్నంత సులువు కాదు. అలాగని అంత కష్టమూ కాదు. చాలామంది బరువు తగ్గడం కోసం తెగ తంటాలు పడుతుంటారు. జిమ్‌ల వెంట, వేట్ రిడక్షన్ సెంటర్ల వెంట పరుగులు పెడుతుంటారు. అయితే అవేవీ అవసరం లేకుండా ఈ కొన్ని టిప్స్ పాటిస్తే మంచి ఫలితాలు వస్తాయని నిపుణులు చెప్తున్నారు.

ప్రతిరోజు ఉదయం నిద్ర లేచిన వెంటనే రెండు గ్లాసుల గోరువెచ్చని నీళ్లను తాగాలి. ఆ తర్వాత ఒక గంట సేపు వాకింగ్ చేసినా, లేదా ఒక ముప్పావు గంట మనకు తెలిసిన వ్యాయామం, ఎక్సర్‌సైజ్ చేసినా మంచి ఫలితం ఉంటుంది. మనకు మనం స్వయంగా ప్రతిరోజు ఉదయం ఈ అలవాటు చేసుకుంటే బరువు తగ్గే అవకాశాలు పెరుగుతాయి. అలాగే.. పీచు పదార్ధం అధికంగా ఉండే ఆహారాలు బరువు తగ్గడానికి తోడ్పడతాయని అధ్యయనాలు చెప్తున్నాయి. పిండి పదార్ధాలను తీసుకోవడం బాగా తగ్గించాలి. వాటికి బదులు ఆరోగ్యకరమైన ఆహారాలు తీసుకోవడం మంచిది. భోజనానికి అరగంట ముందు పావు లీటర్ నీళ్లు తాగితే.. తక్కువ కేలరీలు తినడానికి, 44% ఎక్కువ బరువు తగ్గడానికి సహాయపడుతుంది.

నెమ్మదిగా తినడం వల్ల కూడా బరువు తగ్గే అవకాశం ఉంది. అప్పడే సరిగా జీర్ణక్రియ పని చేస్తుంది. ప్రతీ రోజూ కంటి నిండా నిద్రపోయినప్పడు మాత్రమే బరువు పెరిగే సమస్యలు తలెత్తవు. లేకుంటే హార్మోన్ పనితీరుల్లో మార్పు వచ్చి ఆకలిని పెంచుతుంది. తక్కువగా నిద్రపోవడం, ఆకలి ఎక్కువ కావడం వల్ల ఎక్కువగా తిన్నప్పడు సులభంగా బరువు పెరుగుతారు. కనుక బరువు తగ్గాలి అని భావించేవారు తప్పనిసరిగా ఈ నియమాలు, ఆహారపు అలవాట్లను చేసుకుంటే సరిపోతుంది.



ఇక.. బరువు తగ్గాలని భావించేవారు ఆహారం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. డీప్ ఫ్రై చేసిన ఆహారాలను తినకుండా ఆయిల్ కంటెంట్ తక్కువగా ఉండే ఆహారాలను తింటే మంచిది. స్వీట్లకు దూరంగా ఉండాలి. ఆరోగ్యకరంగా బరువు తగ్గడానికి కీరా దోసకాయ, క్యారెట్, బీట్రూట్ వంటి వాటిని ఆహారంలో భాగం చేసుకోవడం మంచిది. లో కేలరీ పండ్లల్లో యాపిల్ చాలా ముఖ్యమైనది. ఇందులోని ఫైబర్, వాటర్ కంటెంట్ బరువు తగ్గేందుకు ఉపయోగపడుతుంది. ఇంకా వాటర్ కంటెంట్ ఎక్కువగా ఉండే పుచ్చకాయ, పైనాపిల్, స్ట్రాబెర్రీ, ద్రాక్షతో పాటు జామ పండ్లను కూడా తీసుకోవచ్చు. ఆకు కూరల్లో విటమిన్ సీ, విటమిన్ కే ఉంటాయి. బరువు తగ్గడానికి ఇవి చాలా బాగా ఉపయోగపడతాయి. కొత్తిమీర, పుదీనా కూడా చాలా మంచిది. చిప్స్, బిస్కెట్స్, చాక్లెట్లు లాంటి చిరుతిళ్లను, స్నాక్స్‌ను కొంత కాలంపాటు దూరం పెట్టాలి. వాటికి బదులుగా పల్లీలు, పాప్‌కార్న్, మొలకలు, శెనగలు తింటే శరీరానికి కావలసిన పోషకాలు అందడమే కాకుండా బరువు తగ్గుతారు.





# ఇన్‌స్టాలోకి అన్నా కొణిదెల

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ భార్య అన్నా లెజినోవా ఇప్పుడు సోషల్ మీడియాలోకి అడుగుపెట్టి 'అన్నా కొణిదెల'గా మారింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె ఖాతా ప్రారంభించగానే అభిమానుల నుంచి భారీ స్పందన లభిస్తోంది. ముఖ్యంగా ఆమె తొలి పోస్టు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. మొదటి పోస్ట్ సాధారణ పరిచయంకి సంబంధించింది కాగా , రెండో పోస్టులో భర్త పవన్ కళ్యాణ్‌తో కలిసి ఉన్న ఫోటోను షేర్ చేయడం ప్రత్యేకతను సంతరించుకుంది. తన బయోలో ' రష్యన్ హార్ట్ , ఇండియన్ సోల్ అని పేర్కొనడం ద్వారా తన వ్యక్తిత్వాన్ని అందంగా వ్యక్తపరిచారు అన్నా లెజినోవా. రష్యాలో జన్మించిన ఆమె, భారతీయ కుటుంబంలోకి కోడలిగా చేరిన తర్వాత రెండు సంస్కృతుల సమ్మేళనంగా జీవిస్తున్నానని తెలియజేసింది. అలాగే ప్రేమ, కృతజ్ఞతలతో జీవిస్తూ నిరంతరం నేర్చుకుంటూనే ఉంటానని కూడా తన ప్రొఫైల్‌లో తెలియజేశారు. ఇన్‌స్టాగ్రామ్ ఎంట్రీ సందర్భంగా షేర్ చేసిన పోస్టులో, చాలా కాలంగా సోషల్ మీడియాలోకి రావాలని అనుకున్నానని, ఇప్పుడు సరైన సమయం అనిపించిందని తెలిపారు. చిరంజీవి ఆశీస్సులు, పవన్ కళ్యాణ్ మద్దతుతో ఈ కొత్త ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నానని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ఆమె ఖాతా ప్రారంభించిన కొద్ది గంటల్లోనే ఫాలోవర్స్ సంఖ్య లక్ష దాటడం విశేషం. అన్నా కొణిదెల ఇన్‌స్టాలోకి ఎంట్రీ ఇవ్వడంతో పవన్ కళ్యాణ్ తన భార్యకు స్వాగతం పలుకుతూ ఒక పోస్ట్ చేశాడు. 'డియర్ అన్నా కొణిదెల, ఇన్‌స్టాగ్రామ్‌లోకి నీకు సాదర స్వాగతం.. ఈ వేదిక ద్వారా నువ్వు అర్థవంతమైన మరియు స్ఫూర్తిదాయకమైన విషయాలను పంచుకుంటావని ఆశిస్తున్నాను' అంటూ శుభాకాంక్షలు తెలియజేశారు.

# పెద్ది షూటింగ్‌లో రామ్‌చరణ్‌కు స్వల్ప గాయం

**భయమేమీ లేదని వెల్లడించిన చిత్ర బృందం**
**త్వరగా కోరుకోవాలని పవన్ ఆకాంక్ష**

మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం బుచ్చిబాబు సానా దర్శకత్వంలో 'పెద్ది' చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఏప్రిల్ 30న ఈ చిత్రం విడుదల కానుండగా.. వీలైనంత త్వరగా షూటింగ్ ఫినిష్ చేసేలా దూసుకుపోతోంది చిత్ర యూనిట్. ప్రజెంట్ హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. అయితే, ఈ చిత్రానికి సంబంధించిన ఒక కీలకమైన యాక్షన్ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న సమయంలో రామ్ చరణ్‌కు గాయం అయినట్టుగా తెలుస్తోంది. ఆయన కంటి సమీపంలో స్వల్ప గాయం అయిందని సమాచారం. ఈ వార్త తెలియగానే అభిమానులు కాస్త ఆందోళన చెందినప్పటికీ, ఇది చాలా చిన్న గాయమని, అభిమానులు భయపడాల్సిన అవసరం లేదని చిత్ర యూనిట్ వర్గాలు తెలిపాయి. అయితే, కంటికి సంబంధించిన గాయం కావడంతో జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచించారు. అలాగే.. రెండు రోజుల పాటు పూర్తి విశ్రాంతి అవసరమని డాక్టర్లు సలహా ఇచ్చారు. దీంతో.. రెండు రోజుల రెస్ట్ తర్వాత తిరిగి రామ్ చరణ్ పెద్ది సెట్స్‌లో జాయిన్ అవనున్నారు. ఈ షెడ్యూల్ అయిపోయిన తర్వాత.. తదుపరి షెడ్యూల్‌లో ఒక స్పెషల్ సాంగ్ చిత్రీకరణలో పాల్గొననున్నారు. ఇక్కడితో షూటింగ్ దాదాపుగా కంప్లీట్ అయినట్టే. మరోవైపు, ఈ శుక్రవారం మార్చి 27న రామ్ చరణ్ పుట్టినరోజు కావడంతో మెగా సెలబ్రేషన్స్‌కు సిద్ధమవుతున్నారు అభిమానులు. ఆరోజు పెద్ది టీజర్ లేదా గ్లింప్స్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఇలాంటి సమయంలో చరణ్‌కు గాయం అనే వార్త మెగాభిమానులను కాస్త టెన్షన్‌కు గురి చేసినట్టైంది. తమ అభిమాన హీరో త్వరగా కోలుకోవాలని సోషల్ మీడియా వేదికగా కోరుకుంటున్నారు అభిమానులు. ఈ క్రమంలోనే తాజాగా రామ్ చరణ్ గాయం మీద పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, స్పందించారు. ఈ మేరకు మీడియాకు సమాచారం అందించారు. త్వరగా రామ్ చరణ్ కోలుకోవాలని పవన్ కళ్యాణ్ ఆకాంక్షిస్తున్నట్లుగా పవన్ కళ్యాణ్ టీం ఒక మెసేజ్ షేర్ చేసింది. అయితే ఇప్పటివరకు రామ్ చరణ్ కి గాయాలు అయినట్లుగా 'పెద్ది' టీం కానీ, రామ్ చరణ్ టీం కానీ ప్రకటించలేదు. కానీ పవన్ కళ్యాణ్ స్పందించడంతో, ఈ వార్త కన్ఫామ్ అయినట్లయింది.




# సర్కే చునార్ తేరీ సర్కేలో అశ్లీలం తెలియదు

ప్రేమ్ దర్శకత్వంలో రాబోతున్న 'కేడీ: ది డెవిల' సినిమాలోని 'సర్కే చునార్ తేరీ సర్కే' పాట వివాదాస్పదమైన విషయం తెలిసిందే. అన్ని వేదికల్లోనూ ఈ పాటను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) అధికారులను ఆదేశించింది. తాజాగా ఈ పాట వివాదంపై దర్శకుడు ప్రేమ్ స్పందించారు. తనకు కూడా ఆ హిందీ పాట లిరిక్స్ అర్థం తెలియదని అన్నారు. 'ఈ పాట ఐదు భాషల్లో విడుదలైంది. కన్నడలో లిరిక్స్ నేను రాశా. హిందీపై నాకు పట్టులేదు. అందుకే వాటి అర్థం తెలియదు. ప్రస్తుతం దేశంలో ఎన్నో సమస్యలు ఉన్నాయి. ఒకవైపు యుద్ధం, మరోవైపు గ్యాస్ కొరత.. ఇలాంటి వాటి గురించి చర్చించుకుందాం. అంతేగానీ, ఈ పాట లిరిక్స్‌ను వివాదం చేయాల్సిన అవసరం లేదు' అని అన్నారు. ఇక ఉద్దేశపూర్వకంగానే దీన్ని వివాదం చేస్తున్నారంటూ వస్తోన్న వార్తలను ప్రేమ్ ఖండించారు. తాను వివాదాలకు దూరంగా ఉంటానన్నారు. ఇది ఎమోషనల్ మూవీ అని.. ఇందులో ఆ పాట కేవలం పార్టీలో భాగంగా సరదాగా ఉంటుందని చెప్పారు. ఇటీవల ఈ అంశంపై ప్రేమ్ భార్య రక్షిత కూడా స్పందించిన విషయం తెలిసిందే. గతంలో 'పీలింగ్స్', 'డ్రీమమ్ వేకపమ', 'చోళీ కే పీచే' వంటి వందలాది పాటలు వచ్చినప్పుడు అందరికీ అవి సాధారణంగానే అనిపించాయని.. ఇప్పుడెందుకు ఈ పాట విషయంలో ఇలా చేస్తున్నారని అసహనం వ్యక్తంచేశారు.

# హైదరాబాద్‌లో వారణాసి నిర్మాణం


- **రాజమౌళి మూవీ కోసం భారీ సెట్టింగ్**

రాజమౌళి అంటేనే ప్రతి విషయంలోనూ ఎంత అదనపు శ్రద్ధ తీసుకుంటారో తెలిసిందే. ఇక సెట్స్‌పై ఆయన విజన్ మరింత ప్రత్యేకం. తాజాగా వైరలవుతోన్న వారణాసి సెట్ ఇమేజ్‌లు మరోసారి జక్కన్న పనితీరును చాటిచెబుతున్నాయి. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా రానున్న చిత్రం 'వారణాసి'. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీప్రియులు దీనికోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దీంతో దీనికి సంబంధించిన చిన్న అప్‌డేట్ కూడా క్షణాల్లో వైరల్ అవుతోంది. తాజాగా ఈ సినిమా కోసం వేస్తోన్న సెట్ ఇమేజ్‌లు వైరల్‌గా మారాయి. ఈ సినిమా కాశీ నేపథ్యంలో సాగే విషయమని తెలిసిందే. దీంతో కాశీ నగరాన్ని తలపించేలా సెట్‌ను నిర్మిస్తున్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని పురాతన నగరం వారణాసిని అచ్చుగుద్దినట్లు చూపించేలా దాదాపు 700 మీ 400 అడుగుల విస్తీర్ణంలో ఈ భారీ సెట్‌ను నిర్మించారు. వారణాసిలోని ప్రతి వీధి, ప్రతి కట్టడాన్ని తలపించేలా దీన్ని రూపొందిస్తున్నారు. వేల సంఖ్యలో రిఫరెన్స్ చిత్రాలను, కచ్చితమైన కొలతలను వాడినట్లు చిత్ర బృందం పేర్కొంది. ఇక ఈ సెట్‌లో రత్నేశ్వర్ మహాదేవ్ ఆలయం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందట. దీని గోపురం వంపు తిరిగి ఉంటుందని ఈ సెట్‌లో ఆ ఆలయాన్ని కూడా అదే కోణంలో, అదే ఎత్తులో రూపొందిస్తున్నట్లు సమాచారం. నిర్మాణ సమయంలో ఏ చిన్న అలంకరణను, శిల్పకళలను మిస్ కాకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా కథ త్రేతాయుగం నుంచి 2027 వరకూ సాగనున్నట్లు తెలుస్తోంది. దీనికి అనుగుణంగా వారణాసి నగరం కాలక్రమేణా ఎలా మారిందో చూపించడానికి సెట్‌లో ప్రత్యేక మార్పులు చేస్తున్నారు. అప్పటి కట్టడాల నంచి నేటి ఆధునిక కాలం వరకు ప్రతీది ప్రత్యేక శ్రద్ధతో నిర్మిస్తున్నట్లు తాజాగా టీమ్ పంచుకున్న ఫొటోలు చూస్తే అర్థమవుతుంది. వారణాసిలోని గంగా నది తీరం, అక్కడి పురాతన కట్టడాలను తలపించేలా హైదరాబాద్‌లో ఒక భారీ సెట్‌ను రాజమౌళి నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. రాజమౌళి తన సినిమాల్లో లొకేషన్లకు ఇచ్చే ప్రాధాన్యత గురించి అందరికీ తెలిసిందే. ఈ సినిమాలో ఒక కీలకమైన సన్నివేశం వారణాసి నేపథ్యంలో సాగుతుందని, అందుకే ఈ భారీ సెట్ పనులు జరుగుతున్నాయని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. మహేష్ బాబు ఈ సినిమాలో ఒక సాహసికుడిగా కనిపించబోతున్నారు. గ్లోబ్ ట్రాటింగ్ నేపథ్యంలో సాగే ఈ కథలో భారతీయ సంస్కృతిని ప్రతిబింబించేలా వారణాసి వంటి పుణ్యక్షేత్రాలను కూడా జోడించడం రాజమౌళి మార్క్ అని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చిత్రాలలోని గ్రాండియర్ చూస్తుంటే, రాజమౌళి మరోసారి ఇండియన్ సినిమా స్థాయిని ప్రపంచ దేశాలకు చాటిచెప్పేలా ప్లాన్ చేస్తున్నట్లు అర్థమవుతోంది. ప్రస్తుతం మహేష్ బాబు తన మేకోవర్ కోసం కఠినమైన శిక్షణ తీసుకుంటున్నారు. పొడవాటి జుట్టు, గడ్డంతో ఆయన కనిపిస్తున్న లుక్స్ ఇప్పటికే వైరల్ అయ్యాయి. ఐమ్యాక్స్ వెర్షన్‌లోనూ రూపొందుతున్న ఈ సినిమా 2027 వేసవిలో విడుదల కానుంది. ఈ చిత్రాన్ని 120 దేశాల్లో రిలీజ్ చేయాలని రాజమౌళి ఎం`లాన్ చేస్తున్నారు. మహేశ్ బాబుకి జోడీగా ప్రియాంక చోప్రా నటిస్తోన్న ఈ చిత్రంలో విలన్‌గా మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కనిపించనున్న విషయం తెలిసిందే.

# దురంధర్–2 కలెక్షన్ల సునామీ

బాలీవుడ్ స్టార్ రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో, ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్: ది రివెంజ' బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేస్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే ఈ సినిమా కలెక్షన్ల సునామీ సృష్టిస్తూ, రికార్డులను తిరగరాస్తోంది. ట్రేడ్ వర్గాల లెక్కల ప్రకారం, కేవలం ఆరు రోజుల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 919 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించడం విశేషం. ఇందులో ఇండియాలోనే రూ. 695 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లు నమోదు చేయడం సినిమా దూకుడుకు నిదర్శనం. వీక్‌డేస్‌లో కూడా కలెక్షన్లు ఏ మాత్రం తగ్గడం లేదు. ఐదో రోజు రూ. 65 కోట్లు, ఆరవ రోజు రూ. 56 కోట్లకు పైగా నెట్ కలెక్షన్లు రాబట్టింది. ఇక ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా 'ధురంధర్ 2' దూసుకుపోతోంది. ఇప్పటికే రూ. 200 కోట్ల మార్క్‌ను దాటేసి, గ్లోబల్ స్థాయిలో భారీ వసూళ్లను అందుకుంటోంది. ఈ వేగాన్ని చూస్తుంటే, కేవలం వారం రోజుల్లోనే రూ. 1000 కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయం అని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అదే జరిగితే అత్యధిక వేగంగా వారం రోజుల్లోనే వెయ్యి కోట్లు రాబట్టిన చిత్రంగా సరికొత్త రికార్డ్ క్రియేట్ చేయనుంది ధురంధర్ 2. సుమారు నాలుగు గంటల భారీ రన్‌టైమ్ ఉన్నప్పటికీ, ప్రేక్షకులు ఈ సినిమాను ఆదరించడం విశేషం. మొదటి భాగం సుమారు రూ. 1400 కోట్ల వసూళ్లు సాధించిన నేపథ్యంలో, 'ధురంధర్ 2' రూ. 2000 కోట్ల మార్క్‌ను అందుకునే అవకాశముందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. బాలీవుడ్‌లో హిట్ సినిమాలకు లాంగ్ రన్ ఉండటం ఈ అంచనాలకు బలం ఇస్తోంది. ఈ చిత్రంలో రణ్‌వీర్ సింగ్ తన పవర్‌ఫుల్ యాక్షన్‌తో ప్రేక్షకులను ఆకట్టుకోగా, అర్జున్ రాంపాల్, సంజయ్ దత్, ఆర్. మాధవన్ వంటి స్టార్ నటులు కీలక పాత్రల్లో మెప్పించారు.

# పాత వీడియోలతో కుట్ర.. యాంకర్ స్రవంతి సంచలన వివరణ



**యాంకర్ స్రవంతి చొక్కరపు తాజాగా ఒక వివాదంపై ఘాటుగా స్పందించారు. గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ఆమెకు సంబంధించి ఒక 'బెట్టింగ్ యాప్' ప్రమోషన్ వీడియో తెగ వైరల్ అవుతోంది. దీనిపై నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తుండటంతో, ఆమె స్వయంగా రంగంలోకి దిగి అసలు విషయాన్ని బయటపెట్టారు. సదరు వీడియోపై క్లారిటీ ఇస్తూ.. అది ఇప్పటిది కాదని, చాలా కాలం క్రితం చేసిన పాత ప్రమోషన్ అని స్రవంతి స్పష్టం చేశారు. "ఆ సమయంలో నాకు వీటిపై సరైన అవగాహన లేదు. తెలియకుండా చేసిన తప్పు అది. కానీ ఇప్పుడు కావాలనే ఆ పాత వీడియోను మళ్ళీ వైరల్ చేస్తున్నారు" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఫాలోయింగ్ కోసం లేదా కావాలనే కొందరు వ్యక్తులు ఈ పాత అంశాన్ని తెరపైకి తెస్తున్నారని ఆమె అభిప్రాయపడ్డారు.**

**ఈ వివాదంపై స్రవంతి మరింత లోతుగా స్పందిస్తూ, ఈ ఇష్యూ ఎప్పుడో సర్దుమణిగిందని తెలిపారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను, వివరణను ఇప్పటికే సంబంధిత అధికారులకు సమర్పించినట్లు వెల్లడించారు. చట్టపరంగా చేయాల్సిన ప్రతి పనిని పూర్తి చేశానని, ఇప్పుడు కొత్తగా దీనిపై చర్చించాల్సిన అవసరం లేదని ఆమె తేల్చి చెప్పారు. తన అభిమానులకు , సామాన్య ప్రజలకు స్రవంతి ఒక ముఖ్యమైన విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఆ పాత వీడియోలను చూసి మోసపోవద్దని కోరారు. ఆ వీడియో ఎక్కడ కనిపించినా వెంటనే 'రిపోర్ట్' చేయమని విన్నవించారు. తెలుపుతూ చేతులు జోడించారు.**

Published by Badhe Jayasree on behalf of Siri Media. Published at Flat No. 104, Kapil Kausalya Apartment, Shilpa Cereny County Vencher, Near MBR Garden, Pothireddypally X Road, Sangareddy, Telangana State - 502201. Phone : 9697889922. E-Mail : siridailynews@gmail.com.